తెలంగాణ శాసనసభ తెలుగు దినపత్రిక
దినపత్రికలో
అన్ని రకాల ప్రకటనలు
అడ్వర్టైజ్మెంట్స్ మరియు
వార్తల కోసం
సంప్రదించండి: 9100900931

TELTEL/2016/68867
తెలంగాణ శాసనసభ
TELANGANA SHASANA SABHA
తెలుగు దినపత్రిక

సంపుటి : 02 సంచిక : 207 | ఎడిటర్ పాలగోని రాజేష్ | 10 శుక్రవారం జనవరి 2025 | పేజీలు 8 వేల 4



# అమల్లోకి భూభారతి చట్టం

**బిల్లుకు ఆమోద ముద్ర వేసిన గవర్నర్**
**సత్వరం చట్టం అమలుకు చర్యలు తీసుకుంటాం**
**రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి వెల్లడి**

హైదరాబాద్,జనవరి9(శాసనసభ 'భూ భారతి–2024' చట్టానికి గవర్నర్ ఆమోద ముద్ర వేశారు. దీంతో ఇది చట్టరూపం దాల్చింది. గవర్నర్ ఆమోదం తెలపటంతో వీలైనంత త్వరగా చట్టాన్ని అమల్లోకి తెస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. గవర్నర్ ఆమోదించిన భూ భారతి చట్టం బిల్లు కాపీని సచివాలయంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ మంత్రి పొంగులేటికి అందజేశారు. ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందిస్తామని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. చరిత్రాత్మక భూ భారతి చట్టాన్ని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆమోదించడంతో వీలైనంత త్వరగా ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. తెలంగాణ ప్రజానీకానికి మెరుగైన, సమగ్రమైన రెవెన్యూ సేవలను సత్వరమే అందించాలన్న ఆశయంతో భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు. రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా ఈ చట్టాన్ని రూపొందించామని పేర్కొన్నారు.

4

## మాజీ మంత్రి హరీశ్‌రావు గృహ నిర్బంధం

**కోకాపేటలోని ఆయన గృహం వద్ద భారీగా మోహరించిన పోలీసులు**


హైదరాబాద్, జనవరి 9 శాసనసభ



బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ నిర్బంధాలు కొనసాగిస్తున్నది. అక్రమ కేసులు, ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు విధిస్తూ ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుకోవాలని చూస్తున్నది. ఇందులో భాగంగా సిద్దిపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత హరీశ్‌రావును పోలీసులు గృహ నిర్బంధం చేశారు. గురువారం ఉదయంమే కోకాపేటలోని ఆయన నివాసం వద్ద పోలీసులు భారీగా మోహరించారు. ఇంట్లో నుంచి బయటకు రాకుండా అడ్డుకున్నారు. హరీశ్‌రావును కలవడానికి కూడా ఎవరినీ అనుమతించడం లేదు. ఫార్ములా–ఈ కార్ రేస్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం ఏసీబీ విచారణకు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ నేతలను పోలీసులు హౌస్ అరెస్టులు చేస్తున్నారు. కాగా, ఏసీబీ విచారణకు న్యాయవాదితో వెళ్లేందుకు హైకోర్టు అనుమతించిన విషయం తెలిసిందే. రెండు రోజుల క్రితం కేటీఆర్ వెంట న్యాయవాదిని అనుమతించకపోవడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. కేటీఆర్‌ను విచారించే ఏసీబీ కార్యాలయంలో దర్యాప్తు గదికి పకనే ఉన్న గ్రంథాలయ గదిలో న్యాయవాది ఉండేందుకు అనుమతించాలని స్పష్టం చేసింది. దర్యాప్తు ప్రక్రియను ఆడియో, వీడియో రికార్డింగ్ చేయాలన్న ప్రతిపాదన పట్ల సానుకూలంగా స్పందించలేదు. గురువారం జరిగే విచారణ తీరును బట్టి అవసరమైతే పిటిషనర్ మళ్లీ కోర్టుకు రావచ్చని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ కే లక్ష్మణ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 6న ఏసీబీ దర్యాప్తుకు న్యాయవాదిని వెంటబెట్టుకుని వెళ్తే పోలీసులు అనుమతించకపోవడాన్ని సవాలు చేస్తూ కేటీఆర్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై బుధవారం భోజన విరామ సమయంలో హైకోర్టు అత్యవసర విచారణ జరిపింది.

## ఇస్రో స్పేడెక్స్ మిషన్‌లో ఆ ప్రక్రియ మళ్లీ వాయిదా

న్యూఢిల్లీ,జనవరి 9 శాసనసభ



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ చేపట్టిన స్పేడెక్స్ మిషన్‌లో వ్యోమనౌకల అనుసంధాన ప్రక్రియ మళ్లీ వాయిదాపడింది. ఇస్రో ఇటీవల రీషెడ్యూల్ చేసిన ప్రణాళిక ప్రకారం.. ఈ ప్రక్రియ ఇవాళ ఉదయం 8 గంటలకు ప్రారంభం కావాల్సి ఉంది. అయితే ఉపగ్రహాల మధ్య దూరం ఊహించిన దానికంటే ఎక్కువగా ఉండటంతో అనుసంధాన ప్రక్రియను మరోసారి వాయిదా వేసినట్లు ఇస్రో ప్రకటించింది. ఇస్రో రెండు ఉపగ్రహాల మధ్య దూరాన్ని 500 నుంచి 225 మీటర్లకు తగ్గించేందుకు ఓ ప్రయోగం నిర్వహించింది. అయినా రెండు శాటిలైట్స్ మధ్య దూరం ఊహించిన దానికంటే ఎక్కువగా ఉండటంతో మరోసారి స్పేడెక్స్ డాకింగ్‌ను వాయిదా వేసింది. ఈ విషయాన్ని ఇస్రో తన సోషల్ మీడియా ప్లాట్?ఫామ్ ఎక్స్ ద్వారా వెల్లడించింది. ప్రస్తుతం రెండు ఉపగ్రహాలు సురక్షితంగా ఉన్నాయని తెలిపింది. అయితే ఈ డాకింగ్?ప్రక్రియ రీషెడ్యూల్ తేదీని మాత్రం ప్రకటించలేదు. మొదట స్పేడెక్స్ మిషన్‌లో డాకింగ్ ప్రక్రియను జనవరి 7న నిర్వహించేందుకు ఇస్రో ప్లాన్ చేసింది. అయితే మిషన్‌లో కొన్ని సాంకేతిక అవరోధాలు తలెత్తడంతో జనవరి 9వ తేదీకి రీషెడ్యూల్ చేసింది. ఇవాళ కూడా డాకింగ్ సాధ్యపడకపోవడంతో మరోసారి రీషెడ్యూల్ చేయాల్సి వచ్చింది. కాగా ఇస్రో 2024 డిసెంబర్ 30న రాత్రి 10:00:15 గంటలకు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ (స్పేడెక్స్) ప్రయోగాన్ని చేపట్టింది.

## ఈనెలలోగా పౌర స్మృతి బిల్లును పాస్ చేస్తాం

**- సీఎం పుష్కర్ సింగ్ ధామి**

బరేలీ, జనవరి 9 శాసనసభ



ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఈ నెల నుంచే ఉమ్మడి పౌర స్మృతి అమలు కానున్నది. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర సీఎం పుష్కర్ సింగ్ ధామి తెలిపారు. యూపీలోని బరేలీలో జరినగి ఓ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. 29వ ఉత్తరయాని మేళాను సీఎం ధామి ప్రారంభించారు. 2024, ఫిబ్రవరి ఏడవ తేదీన ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉమ్మడి పౌర స్మృతి బిల్లును పాస్ చేసింది. ఆ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం వెంటనే దక్కింది. ఆ తర్వాత మార్చి 12, 2024లో నోటిఫికేషన్ జారీ చేశారు. ఉమ్మడి పౌర స్మృతి 2024 చట్టాన్ని రూపొందించారు. జనవరి 2025 నుంచి ఆ చట్టాన్ని పూర్తిగా అమలు చేయనున్నట్లు చెప్పారు. యూసీసీ అమలు కోసం ప్రత్యేక పోర్టల్, మొబైల్ యాప్ డెవలప్ చేశారు. మహిళలు, పిల్లల సాధికారతే లక్ష్యంగా యూసీసీ అమలు ఉంటుందని సీఎం ధామి గతంలో తెలిపారు.

## ఢిల్లీ ఎన్నికల్లో ఒక్కస్థానం నుంచే పోటీ చేస్తున్నా : కేజ్రీవాల్

న్యూఢిల్లీ,జనవరి 9 శాసనసభ



: దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయాలు వేడెక్కాయి. మరో నెల రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండటంతో.. అధికార, విపక్ష పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో ఢిల్లీ మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ రెండు స్థానాల నుంచి పోటీ చేస్తున్నారంటూ బీజేపీ ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. న్యూ ఢిల్లీతోపాటు మరో స్థానం నుంచి కేజ్రీ పోటీ చేయబోతున్నారంటూ బీజేపీ నేతలు పేర్కొంటున్నారు. ఈ ఆరోపణలపై కేజ్రీవాల్ తాజాగా స్పందించారు. బీజేపీ నేతల ఆరోపణలను ఖండించారు. తాను కేవలం ఒక్క స్థానం నుంచే పోటీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. కాగా, న్యూ ఢిల్లీ స్థానం నుంచి కేజ్రీ వరుసగా నాలుగోసారి పోటీకి సిద్ధమయ్యారు. ఈ స్థానం నుంచి కేజ్రీవాల్‌పై బీజేపీ తరఫున మాజీ ఎంపీ పర్వేశ్ వర్మ, కాంగ్రెస్ అభ్యర్థి సందీప్ దీక్షిత్ పోటీ చేస్తున్నారు. మరోవైపు 2015, 2020 అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు 67, 62 స్థానాలతో ఆప్ క్లీన్ స్వీప్ చేసింది. హ్యాట్రిక్ విక్టరీతో మూడోసారి అధికారంలోకి రావాలని ఆ పార్టీ భావిస్తున్నది. 70 మంది సభ్యులున్న ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5న పోలింగ్ జరుగనున్నది. ఫిబ్రవరి 8న ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు.

## ఫార్ములా కేసులో ముగిసిన కెటిఆర్ విచారణ

**-ఆరున్నర గంటలపాటు విచారించిన అధికారులు**
**-నిధుల మళ్లింపుపై ముగ్గురు అధికారుల ఆరా**
**-విచారణ సమయంలో హాజరైన అడ్వకేట్ రామచంద్రరావు**
**-రేవంత్ ప్రశ్నలనే ఎసిబి అడిగిందన్న కెటిఆర్**

4



హైదరాబాద్,జనవరి9 శాసనసభ : ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ గురువారం ఏసీబీ విచారణకు హాజరు కాగా..దాదాపు ఆరున్నర గంటలపాటు ఎసిబి అధికారులు చేసిన విచారణ ముగిసింది. ఫార్ములా కేసులో నిధుల మళ్లింపుపై కేటీఆర్‌ను విచారించేందుకు ఏసీబీ అధికారులు ఆయనను నడిపించి విచారణ కోసం తీసుకొచ్చారు. ఈ కేసు దర్యాప్తు అధికారి డీఎస్పీ మజీద్ ఖాన్.. కేటీఆర్‌ను విచారించారు. ఈ విచారణను జాయింట్ డైరెక్టర్ రితిరాజ్ పర్యవేక్షించారు. విచారణను వేరే గది నుంచి చూసేందుకు కేటీఆర్ న్యాయవాది రామచంద్రరావును అనుమతించారు

## జగన్ యూకే వెళ్లేందుకు కోర్టు అనుమతి

అమరావతి,జనవరి 9 శాసనసభ

వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ విదేశాలకు వెళ్లేందుకు సీబీఐ కోర్టు అనుమతిచ్చింది. ఈనెల 11 నుంచి 30వ తేదీ వరకు జగన్ యూకేలో పర్యటించనున్నారు. అక్రమాస్తుల కేసులో నిందితుడిగా ఉన్న జగన్ విదేశాలకు వెళ్లడానికి సీబీఐ కోర్టు అనుమతి తీసుకోవాలని గతంలో నాంపల్లి కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాది మే 16వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ మధ్యలో లండన్, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్ దేశాల్లో ఆయన పర్యటించి వచ్చారు. అనంతరం తన కుమార్తె పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబర్ 3 నుంచి 25వ తేదీ వరకు యూకే వెళ్లేందుకు సీబీఐ అనుమతి కోరగా కోర్టు అభ్యంతరం వ్యక్తం చేయడంతో తన పర్యటనను వాయిదా వేసుకున్నారు. తాజాగా మూడోసారి సీబీఐకి అనుమతిని కోరుతూ దరఖాస్తు చేసుకోగా కుటుంబసమేతంగా విదేశాలకు వెళ్లేందుకు న్యాయస్థానం అంగీకారం వ్యక్తం చేసింది.

## రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు ఏసీబీ కోర్టు అనుమతి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు ఏసీబీ కోర్టు అనుమతించింది. ఈ నెల 13 నుంచి 23వ తేదీ వరకు రేవంత్ రెడ్డి ఆస్ట్రేలియా, సింగపూర్, దావోస్ లకు వెళ్లాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆయన తన పర్యటనకు అనుమతించాలని కోరుతూ ఏసీబీ కోర్టులో పిటిషన్ వేశారు. పిటిషన్ ను విచారించిన కోర్టు ఆయన పర్యటనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి ఆరోపణలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. కేసు నేపథ్యంలో ఆయన తన పాస్ పోర్టును ఏసీబీ కోర్టుకు అప్పగించారు. విదేశీ పర్యటనల నేపథ్యంలో తన పాస్ పోర్టును ఆరు నెలల పాటు తనకు అప్పగించాలని కోర్టును కోరారు. రేవంత్ రెడ్డి అభ్యర్థనను అంగీకరించిన కోర్టు... జులై 6వ తేదీ లోగా పాస్ పోర్టును తిరిగి అప్పగించాలని ఆదేశించింది.

# సంపాదకీయం

## టిటిడి నిర్లక్ష్యానికి పరాకాష్ట !

గురువారం 9-1-2025శాసనసభ
తిరుపతిలో దారుణం జరిగింది. వైకుంఠ ఏకాదశి దర్శన టిక్కెట్ల కోసం వచ్చిన ఆరుగురు భక్తులను టిటిడి నిర్లక్ష్యం ఏకంగా వైకుంఠం చేర్చారు. వేలకోట్ల ఆదాయం..వందల్లో ఉద్యోగులు..వేలమంది పోలీసులు.. ఇంతమంది ఉన్నా కనీసం టోకెన్లు సక్రమంగా అందించడం కూడా రాని దౌర్భాగ్యం కనిపించింది. మొన్నటికి మొన్న పుష్ప సినిమా సందర్భంగా హైదరాబాద్ సంధ్య థియేటర్‌లో ఓ మహిళ మృత చెందింది. ఆమె కుమారుడు చావుబతుకుల్లో ఆస్పత్రి బెడ్‌పై పోరాడుతున్నాడు. గతంలో ఆలయాల్లో కూడా తొక్కిసలాట ఘటలను చూశాం. ఇవన్నీ గుణపాఠాలు. ఇలాంటివి చూసినప్పుడు ఎలా ఉండకూడదో నేర్చుకోవాలి. తిరుమల లాంటి ప్రదేశాల్లో మరీ అవసరం. కానీ అలా జరగడం లేదు. సాధారణ రోజుల్లో తొక్కిసలాటలే..పర్వదినాల్లో కూడా అలాగే జరిగితే ఎలా అన్నది ఆలోచన చేయాలి. అయితే వైకుంఠ ద్వార దర్శనం కోసం ముందే టిక్కెట్లు అమ్మడం లేదా, టోకెటన్లు ఇవ్వడం అన్న దౌర్భాగ్యం ఏమిటో అర్థం కాదు. ఇంతగా ప్రచారం చేసి భక్తులను రప్పించి, సరిగా ఏర్పాట్లు చేయకుండా తొక్కిసలాటకు కారణమైన టిటిడి అధికారుల నిర్లక్ష్యం ఏ మాత్రం క్షంతవ్యం కాదు. పోలీసుల ప్రేక్షక పాత్ర ఇక్కడ స్పష్టంగా కనిపించింది. ఇప్పుడు కూడా అదే కనిపించింది. టిటిడి ఛైర్మన్, ఇవో, అదనపు ఇవో ఇలా అనేకమంది నెలరోజుల ముందునుంచే అనేక రకాలుగా సమీక్షలు చేశారు. అట్టహాసం ప్రకటించారు. కానీ జరగాల్సిన నష్టం జరిగింది. వైకుంఠ ఏకాదశి సర్వదర్శన టోకెన్ల జారీలో తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోవడం దారుణమైన ఘటనగానే భావించాలి. టోకెన్ల జారీకి తిరుపతిలోని తొమ్మిది ప్రాంతాల్లో 90 కౌంటర్లు ఏర్పాటు చేయగా... బైరాగిపట్టెడ వద్ద ఈ దారుణం జరిగింది. దైవదర్శనం కోసం వచ్చే భక్తులు రెండు రోజులముందే టోకెన్లు పొందాలని నిబంధన పెట్టడమే దారుణం. అలా కాకుండా తిరుమలలో క్యూలైన్లలో వచ్చిన వారికే దర్శనం కల్పించివుంటే ఈ దారుణం జరిగివుండేది కాదు. తిరుపతిలో టోకెటనలు పొందాలనడమే దారుణం. క్యూలైన్లో ఉన్న భక్తులను ఒక్కసారిగి విడిచిపెట్టడంతో తోపులాట జరిగిందని, ఒకరినొకరు తోసుకుంటూ పోవడంతో ఈ ఘటన జరిగిందని అక్కడ ఉన్నవారు చెబుతున్నారు. సరిగా భద్రత లేదని 3, 4గురు పోలీసులు ఉన్నారని.. తొక్కిసలాట జరిగినప్పుడు 20 మంది వరకు వచ్చారని తెలిపారు. నాలుగు లైన్లలో ఉన్నవారిని ఒక్కసారి వదలడంతో ఈ సమస్య వచ్చిందని అంటున్నారు. ప్రతి ఏడాది తాము వైకుంఠ ఏకాదశికి తిరుమల వస్తామని, ఇలా జరగడం ఇది మొదటిసారని భక్తులు తెలిపారు. నిజానికి ఆన్‌లైన్‌లో టిక్కెట్లు జారీ చేసినా, లేకుంటే దర్శనం కోసం నేరుగా వచ్చిన వారికి మాత్రమే టోకెన్లు జారీ చేసినా ఈ దుర్ఘటన జరిగివుండేది కాదు. కానీ అలా కాకుండ రెండ్రోజుల ముందే భక్తులు వచ్చేలా చేసి, క్యూలైన్ల వద్ద పడిగాపులు కాచేలా చేయడం ఎంతవరకు సమంజసమో టిటిడి పెద్దలు చెప్పాలి. శ్రీవారిమీద భక్తితో వేలకోట్లు టిటిడికి భక్తులు చెల్లిస్తున్నా విఐపిల సేవలు తరిస్తున్నారు. వారికే దర్శనం విషయంలో పెద్దపీట వేస్తున్నారు. కొండపైనే ఏర్పాట్లు చేసి, టోకెన్లు ఇచ్చి ఉంటే ఈ తొక్కిసలాట జరిగేదికాదు. తిరుపతిలో టిక్కెట్లు ఇవ్వడంతో భక్తుల సంఖ్య పెరిగిందని దానికి తగ్గట్టుగా పోలీసు భద్రత లేదని అరథం అవుతోంది. భక్తులను క్యూలో ఒక్కసారిగి విడిచిపెట్టకూడదని.. ఒక్కొక్క క్యూలైన్ విడిచిపెడితే తొక్కిసలాట జరిగేది కాదని కూటా అంటున్నారు. ఒకటో కంపార్టుమెంట్ నుంచి వదిలితే బాగుండేదని, అలా కాకుండా 4, 5 క్యూలైన్లు విడిచిపెట్టారని దీంతో అంతా ఒకేసారి రావడంతో తోపులాట జరిగిందని భక్తులు తెలిపారు. ఒక్కసారిగా గేట్ తీసినప్పుడు భక్తులంతా తోసుకుని వచ్చారని.. తెలిపారు. పురుషులు కూడా మహిళలు, పిల్లలు ఉన్నారని చూసుకోవడం లేదని తోసుకుంటూ వచ్చారని అర్థం అవుతోంది. నిజానికి శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తుల విషయంలో ఆదినుంచీ టిటిడిది నిర్లక్ష్యమే. వేలమంది వస్తుంటే అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయకుండా..విఐపిలను ప్రసన్నం చేసుకునే పనిలో ఉంటున్నారు. గురువారం అర్ధరాత్రి నుంచి తిరుమలలో వైకుంఠ ద్వారాలు తెరుచుకోనున్నాయి. దీని కోసం టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసిందని చెబుతోంది. తిరుపతిలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో గురువారం తెల్లవారుజామున 5 గంటల నుంచి టోకెన్లను జారీ చేయాలని టీటీడీ యంత్రాంగం తొలుత నిర్ణయించింది. అయితే... బుధవారం మధ్యాహ్నం నుంచే కేంద్రాల వద్దకు భారీగా భక్తులు తరలి రావడం మొదలైంది. రాత్రి 8 గంటలకు ఒత్తిడి మరింత పెరిగింది. క్యూలైన్లలోకి రాత్రి 9 గంటల నుంచి భక్తులను పంపించడం మొదలుపెట్టారు. దీంతో కేంద్రాల వెలుపల నిరీక్షిస్తున్న భక్తులు క్యూలైన్లలో ప్రవేశించడానికి ప్రయత్నించే క్రమంలో తొక్కిసలాటలు జరిగాయి. మరీ ముఖ్యంగా... బైరాగిపట్టెడ, విష్ణు నివాసం, ఇందిరా మైదానం కేంద్రాల వద్ద తొక్కిసలాటలు జరిగాయి. ఈ ఘటనలో ఆరుగురు భక్తులు మృతిచెందగా.. పలువురు గాయపడ్డరు. వారిని రుయా ఆస్పత్రికి తరలించారు. నిజానికి ఇక్కడ భక్తులను అదుపు చేయడానికి అవసరమైన ఏర్పాట్లు కానీ, తగిన పోలీసు సిబ్బంది కానీ లేదని అర్థం అవుతోం. వైకుంఠద్వార దర్శనం టోకెన్ల కోసం పెద్ద సంఖ్యలో భక్తులొస్తారని తెలిసీ.. అందుకు తగ్గట్లు ఎందుకు ఏర్పాట్లు చేయలేదని స్పష్టంగా తెలుస్తోంది. విధుల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన బాధ్యత లేకుండా టిటిడి అధికారులు వ్యవహరించారు. ఉన్నతస్థాయి దర్యాప్తు జరిపి, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన అందరిపైనా కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇకపోతే సాధారణ రోజుల్లో కూడా తిరుమలలో కంపార్టుమెంట్లలో కూచోబెట్టడం, ఒక్కసారిగా వదలడం, తోపులాట జరిగేలా చేస్తున్నారు. తిన్నగా భక్తులు స్వామిని దర్శించుకునే పరిస్థితి లేదు. తిరుమల విధానాల్లో సంస్కరణలు రావాలి. నేరుగా వచ్చే భక్తులు దర్శనం చేసుకునే వెసలుబాటు ఉండాలి. ఆన్‌లైన్‌తో పాటు, ఆఫ్‌లైన్ విధానం బలపడాలి. శ్రీవాణి టిక్కెట్లు పొందిన భక్తులను కూడా క్యూలో తోసేస్తున్నారు. వారు టిక్కుట్లు పొందాక సరైన వసతి కల్పించడం లేదు. వసతి కోసంమరోచోటికి పరుగెత్తాలి. అక్కడ రాజముద్ర వేసుకున్నాక మరోచోటికి పరుగెత్తాలి. ఇలాంటి గందరగోళం లేకుండా సింగిల్ విండో విధానంలో దర్శనం, వసతి టిక్కెట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. అలాగే తాజా దుర్ఘటన నేపథ్యంలో తిరుమలలో సంస్కరణలకు శ్రీకారం చుట్టాలి.

## తొక్కిసలాట ఘటనపై మంత్రుల విచారం

**ఆస్పత్రిలో క్షతగాత్రులకు పరామర్శలు**

**మృతుల కుటుంబాలకు 25 లక్షల చొప్పున పరిహారం**

తిరుపతి,జనవరి 9 శాసనసభ
తిరుపతి తొక్కిసలాట ఘటనపై రాష్ట్ర మంత్రులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వైకుంఠ ఏకాదశికి ముందు ఇలాంటి ఘటన దురదృష్టకరమని మంత్రులు అన్నారు. తిరుపతి తొక్కిసలాటలో మృతిచెందిన వారికి ఏపీ ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్ తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామని మంత్రి వెల్లడించారు. తిరుపతి ఘటనలో మృతి చెందిన వారి కుటుంబసభ్యులను రుయా ఆస్పత్రి వద్ద రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, పార్థసారథి, ఆనం రామనాయణ రెడ్డి పరామర్శించారు. అనంతరం స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మంత్రులు పరామర్శించారు. ఆపై మంత్రులు మీడియాతో మాట్లాడుతూ.. బాధితులకు ప్రభుత్వం అండంగా ఉంటుందని మంత్రులు భరోసా ఇచ్చారు. ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వనున్నట్లు మంత్రి అనగాని తెలిపారు. హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. తిరుపతి ఘటనలో కుట్ర కోణం ఉందా? అనే కోణంలోనూ పరిశీలిస్తున్నామని అన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. అలాగే బాధ్యతారాహిత్యంగా పనిచేసిన వారిపై చర్యలు తప్పవని హోంమంత్రి అనిత హెచ్చరించారు. ఈ ఘటనలో మృతి చెందిన వారి మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి అయిన అనంతరం సొంతూర్లకు పంపుతామని, అలాగే గాయపడిన వారికి మెరుగైన చికిత్సకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు. కాగా.. వైకుంఠ ఏకాదశి సందర్భంగా సాధారణ భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించేందుకు ఏర్పాటు చేసిన టోకెన్ కేంద్రాల వద్ద తొక్కిసలాట తీవ్ర విషాదాన్ని నింపింది. తొక్కిసలాటలో ఊపిరాడక అనేక మంది అల్లాడిపోయారు. ఈ ఘటనలో ఆరుగురు మృత్యువాత పడగా.. చాలా మంది గాయపడ్డారు. క్షతగాత్రులు ప్రస్తుతం రుయా, స్విమ్స్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మరోవైపు మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి అవడంతో.. వారి వారి స్వగ్రామాలకు ప్రత్యేక అంబులెన్స్‌లో పోలీసులు తరలించారు. అలాగే తొక్కిసలాటపై తిరుపతి పోలీసులకు తహసీల్దార్ ఫిర్యాదు చేశారు. బైరాగిపట్టెడి రామానాయుడు స్కూల్ దగ్గర జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కోరారు.

## తొక్కిసలాట క్షతగాత్రులకు ఇవో పరామర్శ

**-ఘటనప విచారణ జరుగుతోందని వెల్లడి**

తిరుపతి,జనవరి 9 : శాసనసభ
తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనలో గాయపడి పద్మావతి మెడికల్ కళాశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను టీటీడీ ఈవో శ్యామలారావు గురువారం ఉదయం పరామర్శించారు. క్షతగాత్రుల పరిస్తితిపై వైద్యుల బృందంతో ఈవో ఆరా తీశారు. అనంతరం ఈవో మీడియాతో మాట్లాడుతూ... తొక్కిసలాట ఘటనలో ఆరుగురు మృతి చెందారని.. దాదాపు 41 మంది గాయపడ్డారన్నారు. వారిలో ఇప్పటికే 21 మందిని డిశ్చార్జ్ చేశారని తెలిపారు. ఘటనకు కారణం ఏంటనేది విచారిస్తున్నామని తెలిపారు. డీఎస్పీ గేట్లు తెరవడం వల్లే ఘటన జరిగినట్లు ప్రాథమికంగా తెలిసిందన్నారు. పూర్తి వివరాలు విచారణలో తెలియాల్సి ఉందని అన్నారు. బాధితులను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు రానున్నట్లు టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడించారు. భక్తుల ఆరోగ్యం పరిస్థితిని స్విమ్స్ సూపరింటెండెంట్ రవికుమార్ వివరించారు. అందరికీ చికిత్స అందిస్తున్నామని.. ఈ రోజు సాయంత్రానికి చాలా మందిని డిశ్చార్జ్ చేస్తామని తెలిపారు. ముగ్గురు మాత్రం మరో రెండు మూడు రోజుల పాటు అబ్జర్వేషన్‌లో ఉండాల్సి ఉంటుందని సూపరింటెండెంట్ రవికుమార్ పేర్కొన్నారు. వైకుంఠ ఏకాదాశి సందర్భంగా వైకుంఠ ద్వార దర్శనాల కోసం ఏర్పాటు చేసిన టోకెన్ కౌంటర్ల వద్ద తీవ్ర విషాదం చోటు చేసుకుంది. కౌంటర్ కేంద్రాల వద్ద అర్ధరాత్రి తొక్కిసలాట జరగడంతో ఆరుగురు భక్తులు మృతి చెందారు. వారిలో ఐదుగురు మహిళలే ఉన్నారు. బుధవారం రాత్రి గేట్లు తెరవగా భక్తులు ఒక్కసారిగా దూసుకొచ్చారు. దీంతో మూడు కౌంటర్ కేంద్రాల వద్ద తొక్కిసలాట చోటు చేసుకుంది. తొక్కిసలాటలో ఆరుగులు భక్తులు మృత్యువాత పడగా.. అనేక మంది గాయపడ్డారు. వెంటనే వారిని రుయా, స్విమ్స్ ఆస్పత్రులకు తరలించారు. తొక్కిసలాటలో ఊపరాడక అనేక మంది మహిళలు అల్లాడిపోయారు.

## టిటిడి నిర్లక్ష్యమే కొంప ముంచింది

**-మృతుల కుటుంబాలకు కోటి పరిహారం ఇవ్వాలి**


**-మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ డిమాండ్**

తిరుపతి,జనవరి 9 శాసనసభ
తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనలో టీటీడీ విజిలెన్స్, పోలీసుల వైఫల్యమే కారణమని టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఆరోపించారు . తిరుమలలో వైకుంట ద్వార దర్శనం సందర్భంగా తిరుపతిలో ఏర్పాటు చేసిన టోకెన్ల జారీ కేంద్రంలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు చనిపోగా 48 మంది గాయపడ్డారు. ఈ ఘటనపై ఆయన గురువారం తిరుపతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. వేలాది మంది భక్తులు టోకెన్ల కోసం కేంద్రాలకు రాగా కొద్ది మంది మాత్రమే అక్కడ పోలీసులు ఉండడంతో భక్తులను నియంత్రించలేకపోయారని ఆరోపించారు. వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లపై నెలరోజులుగా రోజుకో సమీక్షను నిర్వహించి చివరకు చేతులెత్తేయడంతో ఘటన జరిగిందని విమర్శించారు. పనిచేసేవారు తక్కువై, పర్యవేక్షించే వారు ఎక్కువయ్యారని పేర్కొన్నారు. చంద్రబాబుకు ఆర్భాటం ఎక్కువ, ఆచరణ తక్కువ ఉంటుందని ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ సమర్ధవంతంగా పనిచేసిందని గుర్తు చేశారు. భక్తులకు మేలైన నిర్ణయాలే తీసుకున్నామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నామని వివరించారు. ప్రస్తుత టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు టీటీడీని రాజకీయ క్రీడా మైదానంగా మార్చివేశారని దుయ్యబట్టారు. ఇది ముమ్మాటికి ప్రభుత్వ తప్పిదమేనని అన్నారు. మృతుల కుటుంబాలకు రూ. కోటి, క్షతగాత్రులకు రూ. 20 లక్షల పరిహారాని చెల్లించాలని డిమాండ్ చేశారు. సనాతన ధర్మాన్ని రక్షిస్తామన్న పవన్‌కల్యాణ్ ఇప్పుడేం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.

## తొక్కిసలాట ఘటనపై రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి

**-మృతుల కుటుంబాలకు ముర్ము, మోడీల సంతాపం**

న్యూఢిల్లీ,జనవరి 9శాసనసభ బుధవారం తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఘటన పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు తన హృదయపూర్వక సానుభూతిని తెలిపారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆమె కోరారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో చాలా మంది మరణించారని తెలిసి బాధపడ్డాను. మృతుల కుటుంబాలకు నా హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తున్నాను. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను' అని రాష్ట్రపతి ముర్ము ఎక్స్ పై ఒక పోస్ట్‌లో తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తిరుపతి తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోవడం పట్ల సంతాపం తెలిపారు. ఈ మేరకు ఎక్స్ పై ఒక పోస్ట్‌లో ప్రధానమంత్రి కార్యాలయం ఇలా పేర్కొంది. 'ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో జరిగిన తొక్కిసలాట బాధాకరం. తమ సన్నిహితులను మరియు ప్రియమైన వారిని కోల్పోయిన వారి పట్ల నా సానుభూతి. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని నేను ప్రార్థిస్తున్నాను. బాధితులకు ఏపీ ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం అందిస్తోంది.' అని పేర్కొన్నారు. తిరుమల కొండలపై వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం టిక్కెట్ల కోసం బుధవారం రాత్రి వందలాది మంది భక్తులు పోటీ పడుతుండగా జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మరణించగా, డజన్ల కొద్దీ మంది గాయపడ్డారు.



## తిరుపతి ఘటనపై సిఎం చంద్రబాబుకు నివేదిక

అమరావతి,జనవరి 9శాసనసభ
తిరుమలలో తొక్కిసలాట ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అధికారులు నివేదిక అందజేసినట్లు తెలుస్తోంది. డీఎస్పీ అత్యుత్సాహం వల్ల ఒక్కసారిగా భక్తులు రావడంతో తొక్కిసలాట జరిగిందని.. ఘటనపై డీఎస్పీ సరిగా స్పందించలేదని నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. 'ఎస్పీ వెంటనే సిబ్బందితో వచ్చి భక్తులకు సాయం చేశారు. అంబులెన్స్ వాహనాన్ని టికెట్ కౌంటర్ బయట పార్క్ చేసి డ్రైవర్ వెళ్లిపోయాడు. 20 నిమిషాల పాటు డ్రైవర్ అందుబాటులోకి రాలేదు. డీఎస్పీ, అంబులెన్స్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే భక్తులు చనిపోయారు' అని నివేదికలో వెల్లడించినట్లు తెలుస్తోంది. ఈ ఘటన జరిగిన తర్వాత డీఎస్పీ తీరుపై ఎస్పీ సుబ్బారాయుడుకు కలెక్టర్ ఫిర్యాదు చేశారు. వైకుంఠద్వార దర్శనం టోకెన్ల జారీలో తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు మృతి చెందారు.ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సిఎం చంద్రబాబు.. డీజీపీ, టీటీడీ ఈవో, తిరుపతి కలెక్టర్, ఎస్పీలతో టెలీకాన్ఫరెన్స్ లో మాట్లాడారు. ఘటనకు కారణాలు, ప్రస్తుత పరిస్థితిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైకుంఠద్వార దర్శనం టోకెన్ల కోసం వచ్చే భక్తులకు తగిన ఏర్పాట్లు ఎందుకు చేయలేదని అధికారులపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

## ఒక్కో సినిమాకు ఒక్కో తీరా..?

**గేమ్ ఛేంజర్‌కు ఎందుకు అదనపు షోలు**

**సీఎం రేవంత్‌పై ఫైర్ అయిన ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్**

హైదరాబాద్, జనవరి 9 శాసనసభ
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు నాల్కల ధోరణి మరోసారి నిరూపితమైందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ధ్వజమెత్తారు. గేమ్ ఛేంజర్ సినిమాకు ఎందుకు అదనపు షోలు..? టికెట్ రేట్ల పెంపు ఎందుకు..? అని దేశపతి ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. గేమ్ ఛేంజర్ సినిమాకు టికెట్ల రేట్ల పెంపు, అదనపు షోలకు అనుమతిస్తూ జారీ చేసిన జీవోతో రేవంత్ రెడ్డిది రెండు నాల్కల ధోరణి అని అర్థమైపోయింది. టికెట్ల పెంపుదల ఉండదు అని అసెంబ్లీ సాక్షిగా సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రతిజ్ఞ చేశారు. ఆయన ఇప్పుడు ఎక్కడ దాక్కున్నారు. ఈ జీవోపై వివరణ ఇవ్వాలి. గేమ్ ఛేంజర్ సినిమా వచ్చేసరికి రేట్ల పెంపుదలకు అవకాశం ఇచ్చారు. ఆయనకు ప్రత్యేకమైన ప్రివిలేజ్ ఎందుకు..? ఇక నుంచి బెనిఫిట్ షోలు, అదనపు షోలు ఉండవని సీఎం నెల రోజుల క్రితం అసెంబ్లీలో ప్రకటించారు. మరి గేమ్ ఛేంజర్‌కు ఎందుకు ప్రివిలేజ్ ఇస్తున్నారు అని దేశపతి శ్రీనివాస్ ప్రశ్నించారు. నిజానికి దిల్ రాజు అనే వ్యక్తి తెలంగాణ ఉద్యమంలో ఎప్పుడు కూడా కలిసి రాలేదు. ఏ ఒక్క రోజు కూడా తెలంగాణకు అండగా నిలబడలేదు. సంక్రాంతికి వస్తున్నాం ఫంక్షన్‌లో తెలంగాణ కల్చర్‌ను దిల్ రాజు అవమానించాడు. ఆయనకు ఆంధ్రాలోనే సినిమాలకు వైబ్ ఉంటుందట. తెలంగాణలో వైబ్ ఉండదట. అయితే తెలంగాణలో సినిమాలు మానుకో దిల్ రాజు. కల్లు, మాంసం దుకాణాలు పెట్టుకో.. ఇక్కడ వైబ్ ఉంటుంది. నీకు కావాల్సింది వైబ్ కదా. ఇక్కడి సినిమాలకు వైబ్ ఉండదని అంటున్నవ్ కదా.. అని దేశపతి శ్రీనివాస్ మండిపడ్డారు. సినిమా టికెట్ రేట్లు పెంచమన్న రేవంత్ రెడ్డి పూటకోమాట మార్చుతున్నాడు. సినిమాటోగ్రఫి శాఖ మంత్రి టికెట్ రేట్ల పెంపుదల ఉండదని ప్రకటించారు. మరి దీనిపై సమాధానం చెప్పాలి. సినిమాలు విడుదలైతే టికెట్ రేట్లు పెంచి పేద ప్రజల జేబులు లూటీ చేయొద్దన్నాడు రేవంత్ రెడ్డి. మరి గేమ్ ఛేంజర్‌కు ఎందుకు పెంచాల్సిన అవసరం వచ్చింది. నిజాయితీ లేని ముఖ్యమంత్రి, మంత్రలు ఉండటం దురదృష్టకరమని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ పేర్కొన్నారు.



# తిరుపతి ఘటనపై భిన్న వాదనలు

## డిఎస్పీ అత్యుత్సాహంతోనే ఘటన తగినంత మంది పోలీస్ సిబ్బంది లేకపోవడంతో దుర్ఘటన

తిరుపతి,జనవరి 9 : శాసనసభ

పవిత్ర వైకుంఠ ఏకాదశి రోజున తిరుమల శ్రీవారిని దర్శించుకోవాలని భావించిన వారు టోకెన్లు తీసుకునే లోపే తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటన అందరినీ తీవ్రంగా కలిచివేసింది. అసలు ఈ దుర్ఘటనకు సంబంధించి తప్పు ఎవరిదనే దానిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. టోకెన్లు తమ వరకూ రావేమో అని కొందరు భక్తులు అత్యుత్సాహం ఓ కారణమంటూ కొందరు వాదిస్తున్నారు. అయితే, అధిక సంఖ్యలో భక్తులు వస్తారని తెలిసినా తగిన రీతిలో అధికారులు, పోలీసులు ఏర్పాట్లు చేయలేదని కొందరు విమర్శిస్తున్నారు. పోలీసుల అత్యుత్సాహం కూడా దీనికి కారణమని భావిస్తున్నారు. ఓ సెంటర్ వద్ద భక్తురాలు అస్వస్థతకు గురి కావడంతో డీఎస్పీ గేట్లు తెరవడంతోనే తోపులాట జరిగిందని ఇప్పటికే టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ప్రకటించారు. మరోవైపు, ఈ ఘటనపై సీఎం చంద్రబాబుకు అధికారులు నివేదిక అందజేశారు. 'తొక్కిసలాట జరిగినా డీఎస్పీ సరిగా స్పందించలేదు. ఎస్పీ వెంటనే సిబ్బందితో వచ్చి భక్తులకు సాయం చేశారు. అంబులెన్స్ వాహనాన్ని టికెట్ కౌంటర్ బయట పార్క్ చేసి డ్రైవర్ వెళ్లిపోయాడు. 20 నిమిషాలైనా అతను అందుబాటులోకి రాలేదు. డీఎస్పీ, అంబులెన్స్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే భక్తులు చనిపోయారు.' అని అధికారులు నివేదికలో పేర్కొన్నారు. ఈ ఘటనలో గాయపడ్డ క్షతగాత్రులను టీటీడీ ఛైర్మన్ సహా ఈవో, జేఈవో, ఇతర అధికారులు పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించేలా అక్కడే ఉండి పర్యవేక్షిస్తున్నారు. 48 మంది గాయపడగా.. 40 మందిని డిశ్చార్జి చేసినట్లు తెలుస్తోంది. మిగిలిన 8 మంది చికిత్స పొందుతున్నారు. తిరుపతిలోని 8 కేంద్రాల వద్ద స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్ల జారీకి అధికారులు ఏర్పాట్లు చేయగా.. ఈ నెల 10, 11, 12 తేదీలకు సంబంధించి మొత్తం 1.20 లక్షల టోకెన్లు జారీ చేయనున్నట్లు ప్రకటించారు. గురువారం ఉదయం 5
గంటలకు టోకెన్లు జారీ చేస్తామని తెలపగా.. బుధవారం ఉదయం నుంచే రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో క్యూలైన్లలో వేచి ఉన్నారు. బైరాగిపట్టెడలోని రామానాయుడు పాఠశాల వద్ద తాకిడి తక్కువగా ఉంటుందని భావించిన భక్తులు బుధవారం ఉదయం పదింటికే అక్కడికి చేరుకున్నారు. రాత్రికి పరిసర ప్రాంతాలన్నీ రద్దీగా మారాయి. దీంతో పోలీసులు పక్కనే ఉన్న పద్మావతి పార్కులోకి భక్తులను వదిలి.. రాత్రి 8:20 గంటలకు క్యూలైన్‌లోకి అనుమతించారు. ఈ క్రమంలో తోపులాట జరగ్గా.. కొంతసేపు భక్తులను నిలిపేసి సహాయ చర్యలు చేపట్టారు. దీంతో ప్రాణనష్టం తగ్గింది. గాయపడ్డ భక్తులను అంబులెన్సులో పోలీసులు రుయా, స్విమ్స్ ఆస్పత్రులకు తరలించారు. ఈ కేంద్రం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయకపోవడంపైనా విమర్శలు వస్తున్నాయి. భక్తులను పార్కులో ఉంచి ఒకేసారి అనుమతించడంతో ప్రాణనష్టం జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. టీటీడీ అధికారులు ఏర్పాట్లలో విఫలమయ్యారని భక్తులు ఆరోపిస్తున్నారు. మధ్యాహ్నం 2 గంటలు – భక్తులతో నిండిన పార్కు అదుపు చేసేందుకు పోలీసులు అక్కడికి భారీగా చేరుకున్నారు. ఃాయంత్రం 7 గంటలకు – పార్కు పూర్తిగా నిండిపోవడంతో ఎవరూ ఎటూ కదల్లేని పరిస్థితి నెలకొంది. ఃాత్రి 8:20 – పార్కు నుంచి టికెట్ల జారీ కౌంటర్లోకి అనుమతించడంతో భక్తుల మధ్య తోపులాట జరిగింది. ఒక్కసారిగా తోసుకుని రావడంతో ప్రాణ నష్టం జరిగింది. ఃాత్రి 8:40 – సంఘటన స్థలానికి చేరుకున్న అంబులెన్సులు.. తిరుపతి స్విమ్స్, రుయా ఆస్పత్రులకు క్షతగాత్రులను తరలించారు. ఎస్పీ సుబ్బారాయుడు సిబ్బందితో అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

తిరుపతి తొక్కిసలాట ఘటనతో తీవ్ర విషాదం నెలకొంది. బుధవారం రాత్రి ఎటుచూసినా బాధితుల ఆర్తనాదాలు, బాధితులకు పోలీసులు, స్థానిక భక్తులు సీపీఆర్ చేసిన దృశ్యాలే కనిపించాయి. వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల కేంద్రాల వద్ద జరిగిన దుర్ఘటనలో ఆరుగురు మృతి చెందగా.. 48 మందికి గాయాలయ్యాయి. అయితే, ఘటనకు పోలీసుల, అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కూడా కారణమని.. సరైన ఏర్పాట్లు చేయలేదని భక్తులు ఆరోపిస్తున్నారు. తిరుపతిలోని 8 కేంద్రాల వద్ద స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్ల జారీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 10, 11, 12 తేదీలకు సంబంధించి మొత్తం 1.20 లక్షల టోకెన్లు జారీ చేయనున్నట్లు ప్రకటించారు. గురువారం ఉదయం 5 గంటలకు టోకెన్లు జారీ చేస్తామని తెలపగా.. బుధవారం ఉదయం నుంచే రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో క్యూలైన్లలో వేచి ఉన్నారు. బుధవారం సాయంత్రానికి భక్తుల రద్దీ మరింత పెరిగింది. జీవకోన, బైరాగిపట్టెడ, శ్రీనివాసం, అలిపిరి ప్రాంతాల్లో తొక్కిసలాట జరిగింది. తొలుత జీవకోన వద్ద ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద
స్వల్ప తోపులాట జరగ్గా.. రాత్రి 7 గంటల సమయంలో భక్తులు క్యూలైన్లలోకి ప్రవేశించబోయారు. పోలీసులు అడ్డుకునేందుకు యత్నించినా ఒకరినొకరు తోసుకుంటూ లోపలికి వెళ్లే క్రమంలో తోపులాట జరిగింది. ఎస్పీ సుబ్బారాయుడు అక్కడికి వెళ్లి పరిస్థితి అదుపులోకి తెచ్చారు. ఇక్కడ పరిస్థితి అదుపులోకి వచ్చిందని భావిస్తుండగానే.. ఎక్కువ మంది భక్తులుండడంతో అధికారులు వారిని పక్కనే ఉన్న శ్రీ పద్మావతి పార్కులోకి అనుమతించారు. బుధవారం రాత్రి 8:15 గంటల సమయంలో పార్కులో ఉన్న ఓ వ్యక్తి అస్వస్థతకు గురి కావడంతో ఆయనకు వైద్యం అందించేందుకు అధికారులు గేట్లు తెరవబోయారు. అయితే, క్యూలైన్లలోకి వదిలేందుకే గేట్లు తెరుస్తున్నారని భావించిన కొందరు ఒక్కసారిగా దాన్ని బలంగా తోసుకుని ముందుకెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో చాలామంది భక్తులు కింద పడిపోయారు. ఈ క్రమంలో ఊపిరాడక పలువురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పోలీసులు క్షతగాత్రులను అంబులెన్సులో రుయా, స్విమ్స్ ఆస్పత్రులకు తరలించారు. ఆస్పత్రికి వెళ్లే సమయానికే నలుగురు మృతి చెందినట్లు
వైద్యాధికారులు తెలిపారు. బైరాగిపట్టెడ వద్ద జరిగిన ఘటనలోనే ఆరుగురు చనిపోయారు. అటు, సమాచారం అందుకున్న వెంటనే టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, ఎస్పీ సుబ్బారాయుడు, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు పర్యవేక్షించారు. గతంలో బారికేడ్లను ఏర్పాటు చేసి అక్కడ పరిస్థితిని అనుసరించి భక్తులను క్యూలైన్లలోకి అనుమతించేవారు. ఎన్నడూ లేని విధంగా బైరాగిపట్టెడ టోకెన్ల కేంద్రం వద్ద ఉన్న పార్కులోకి భక్తులను అనుమతించారు. బుధవారం మధ్యాహ్నం నుంచి అక్కడే కూర్చుని ఉండడంతో పలువురు అస్వస్థతకు గురయ్యారు. పార్కులో ఎక్కువ మంది ఉండడం.. వారంతా ఒక్కసారిగా వెలుపలికి వచ్చేందుకు గేటును తోయడంతో కిందపడిపోయారు. ఇదే తొక్కిసలాటకు దారి తీసిందని సమాచారం



## మాజీ మంత్రి హరీశ్‌రావు గృహ నిర్బంధం

### కోకాపేటలోని ఆయన గృహం వద్ద భారీగా మోహరించిన పోలీసులు

హైదరాబాద్, జనవరి 9 శాసనసభ
: బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ నిర్బంధాలు కొనసాగిస్తున్నది. అక్రమ కేసులు, ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు విధిస్తూ ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుకోవాలని చూస్తున్నది. ఇందులో భాగంగా సిద్దిపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత హరీశ్‌రావును పోలీసులు గృహ నిర్బంధం చేశారు. గురువారం ఉదయంమే కోకాపేటలోని ఆయన నివాసం వద్ద పోలీసులు భారీగా మోహరించారు. ఇంట్లో నుంచి బయటకు రాకుండా అడ్డుకున్నారు. హరీశ్‌రావును కలవడానికి కూడా ఎవరినీ అనుమతించడం లేదు. ఫార్ములా–ఈ కార్ రేస్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం ఏసీబీ విచారణకు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ నేతలను పోలీసులు హౌస్ అరెస్టులు చేస్తున్నారు. కాగా, ఏసీబీ విచారణకు న్యాయవాదితో వెళ్లేందుకు హైకోర్టు అనుమతించిన విషయం తెలిసిందే. రెండు రోజుల క్రితం కేటీఆర్ వెంట న్యాయవాదిని అనుమతించకపోవడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. కేటీఆర్‌ను విచారించే ఏసీబీ కార్యాలయంలో దర్యాప్తు గదికి పకనే ఉన్న గ్రంథాలయ గదిలో న్యాయవాది ఉండేందుకు అనుమతించాలని స్పష్టం చేసింది. దర్యాప్తు ప్రక్రియను ఆడియో, వీడియో రికార్డింగ్ చేయాలన్న ప్రతిపాదన పట్ల సానుకూలంగా స్పందించలేదు. గురువారం జరిగే విచారణ తీరును బట్టి అవసరమైతే పిటిషనర్ మళ్లీ కోర్టుకు రావచ్చని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ కే లక్ష్మణ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 6న ఏసీబీ దర్యాప్తుకు న్యాయవాదిని వెంటబెట్టుకుని వెళ్తే పోలీసులు అనుమతించకపోవడాన్ని సవాలు చేస్తూ కేటీఆర్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై బుధవారం భోజన విరామ సమయంలో హైకోర్టు అత్యవసర విచారణ జరిపింది.

## అలా అయితే ఇండియా కూటమి ముగించండి

### -: ఒమర్ అబ్దుల్లా

న్యూఢిల్లీ, జనవరి 9 శాసనసభ :
జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా కీలక వ్యాఖ్యలు చేశారు. కేవలం పార్లమెంట్ ఎన్నికల వరకే అయితే 'ఇండియా' కూటమి పొత్తును ముగించాలని సూచించారు. ఆ కూటమికి నాయకత్వం, ఎజెండా వంటివి ఏమీ లేకపోవడాన్ని ఆయన విమర్శించారు. 'ఇండియా' కూటమిలో భాగమైన ఆప్, కాంగ్రెస్ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో విడివిడిగా పోటీ చేయడంపై గురువారం మీడియా అడిగిన ప్రశ్నకు ఒమర్ అబ్దుల్లా సమాధానమిచ్చారు. 'దీని గురించి నేను ఏమీ చెప్పలేను. ఎందుకంటే ఢిల్లీ ఎన్నికలతో మాకు సంబంధం లేదు. ఆప్, కాంగ్రెస్, క్షేత్రస్థాయిలో ఉన్న ఇతర పార్టీలు బీజేపీని ఎలా ఎదుర్కోవాలో నిర్ణయించుకోవాలి' అని అన్నారు. కాగా తనకు తెలిసినంత వరకు 'ఇండియా' బ్లాక్‌కు ఎలాంటి కాలపరిమితి లేదని ఒమర్ అబ్దుల్లా తెలిపారు. అయితే దురదృష్టవశాత్తు కూటమి సమావేశాన్ని నిర్వహించడం లేదని చెప్పారు. దీంతో కూటమి నాయకత్వం, ఎజెండా, ఉనికి గురించి తనకు స్పష్టత లేదని అన్నారు. 'అది (ఇండియా బ్లాక్) కేవలం పార్లమెంట్ ఎన్నికల కోసమే అయితే వారు కూటమిని ముగించాలి' అని సూచించారు.

## తిరుమలలో తొక్కిసలాట ఘటన దురదుష్టకరం

### -: శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, జనవరి 9 :శాసనసభ
తిరుమలలో తొక్కిసలాట ఘటన దురదృష్టకరం, బాధాకరమని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. తొక్కిసలాటలో చనిపోయిన మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నామని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, టీటీడీ బోర్డుకు విజ్ఞప్తి.. ఇలాంటి ఘటనలు జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసుకోవాలి. లోపాలను సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉంది. తిరుమల బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి సందర్భాల్లో అత్యధిక భక్తులు తెలంగాణ, తమిళనాడు నుంచి భారీగా తరలివచ్చే అవకాశం ఉంది. కాబట్టి ఈ రెండు రాష్ట్రాలతో మాట్లాడి అదనపు సిబ్బందిని సమకూర్చుకోవాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. గాయపడిన వారికి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు పంపించాలని కోరుతున్నాం అని శ్రీనివాస్ గౌడ్ సూచించారు. హైదరాబాద్‌లో టీటీడీ కార్యాలయం ఉంది. ఇక్కడ బుకింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేస్తే ఇలాంటి పరిస్థితి తలెత్తదు. టోకెన్లు దొరక్కపోయినా చాలా మంది వెళ్లడంతో తొక్కిసలాట జరిగే అవకాశం ఉంది. కాబట్టి హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో టోకెన్లు ఇవ్వాలి. తిరుమలలో తెలంగాణ ప్రజాప్రతినిధుల లేఖలను అనుమతించాలన్న ప్రతిపాదనను టీటీడీ బోర్డు స్వీకరించినందుకు సంతోషం. తమ వ్యాఖ్యలపై రకరకాల విమర్శలు వచ్చినప్పటికీ మేం అడిగిన దాంట్లో ధర్మం ఉందని న్యాయం చేశారు. తెలంగాణలో చాలా వరకు ప్రతి ఇంటి దైవం వెంకటేశ్వర స్వామి కాబట్టి.. దర్శనాల టోకెన్ల కోసం తెలంగాణలో కూడా కౌంటర్లు ఏర్పాటు చేయండి. తెలంగాణ భక్తులు సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

## ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి ఎన్‌కౌంటర్

### -ముగ్గురు నక్సల్స్ హతం

ఛత్తీస్‌గఢ్, జనవరి 9శాసనసభ ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. సుక్మా జిల్లాలో బీజాపూర్ సరిహద్దు వద్ద భద్రతా బలగాలు, నక్సలైట్ల కు మధ్య గురువారం ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. భద్రతా సిబ్బంది గురువారం ఉదయం సుక్మా–బీజాపూర్ సరిహద్దులోని అటవీప్రాంతంలో నక్సలైట్ వ్యతిరేక ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో అక్కడ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు నక్సలైట్లు హతమయ్యారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నట్లు సుక్మా ఎస్పీ కిరణ్ చావన్ తెలిపారు. కాగా, మూడు రోజుల క్రితం ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు దుశ్చర్యకు పాల్పడిన విషయం తెలిసిందే. జవాన్ల వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులకు పేలుళ్లకు పాల్పడ్డారు. బీజాపూర్ జిల్లా భేద్రే కుట్రు రహదారిలో ఐఈడీ పేలుళ్లకు మావోయిస్టులు పాల్పడ్డారు. ఐఈడీ పేలిన సమయంలో పోలీసుల వాహనంలో 15 మంది డీఆర్‌జీ జవాన్లు ఉన్నారు. ఈ దుశ్చర్యలో 8 మంది జవాన్లతో పాటు డ్రైవర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ముగ్గురు జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి.

## నల్లగొండ జిల్లాలో దొంగలు బీభత్సం

నల్లగొండ, జనవరి 9 శాసనసభ
నల్లగొండ జిల్లాలో దొంగలు బీభత్సం సృష్టించారు. వరుస దొంగతనాలకు పాల్పడుతూ అందిన కాడికి దోచుకొని పరారయ్యారు. వివరాల్లోకి వెళ్తే..మునుగోడు మండల కేంద్రంలో దొంగలు హడలెత్తించారు. వరుసగా ఐదు చోట్ల చోరీకి పాల్పడ్డారు. దుండగులు తాళాలు వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి దోపిడీకి పాల్పడ్డారు. మండల కేంద్రానికి చెందిన నాగరాజు స్వీట్ హౌస్‌లో రూ.70,000 నగదు, వారి ఇంట్లోనే 12 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. వడ్డెర గూడెంకు చెందిన ముద్దంగుల నర్సింహ ఇంట్లో రెండు లక్షల యాభై వేల నగదు అపహరించినట్లు సమాచారం. ఇదే గ్రామానికి చెందిన రాసమల్ల శ్రీరాములుకు చెందిన బైక్ అపహరణకు గురైంది. మునుగోడు లోని వెనిగల పురుషోత్తమ్ ఇంట్లో రూ.60,000 నగదు, అరకిలో వెండి ఎత్తుకెళ్లారు. ఫారెస్ట్ ఆఫీస్‌లో సైతం దొంగతనం జరుగడం విశేషం. కాగా, వరుస దొంగతనాలతో స్థానిక ప్రజలు భయాందోళనలకు గురవుతు న్నారు. నిందితులను త్వరగా పట్టుకొని రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

## ఆర్ బి ఇండస్ట్రియల్ జిన్నింగ్ మిల్‌లో భారీ అగ్ని ప్రమాదం

కుమ్రం భీం ఆసిఫాబాద్, జనవరి 9 శాసనసభ
కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం ఇందానీ ఎక్స్ రోడ్ వద్ద గల ఆర్ బి ఇండస్ట్రియల్ జిన్నింగ్ మిల్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పత్తి లోడుతో వచ్చిన వాహననికి ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని వాహనంలోని పత్తితో పాటు మిల్లులో ఉన్న పత్తి దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేస్తున్నారు. ఈ ప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## విద్యాశాఖ సెక్రెటరీగా సీనియర్ ఐఏఎస్ అధికారిణి యోగితా రాణా

హైదరాబాద్,జనవరి 9 శాసనసభ :
విద్యాశాఖ సెక్రెటరీగా సీనియర్ ఐఏఎస్ అధికారిణి యోగితా రాణా నియమితులయ్యారు. 2003 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన రాణా.. ప్రస్తుతం సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శిగా భాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే విద్యాశాఖ సెక్రెటరీగా ఉన్న బుర్రా వెంకటేశంను రాష్ట్ర ప్రభుత్వం గతేడాది డిసెంబర్‌లో టీజీపీఎస్సీ చైర్మన్‌గా నియమించింది. దీంతో ఎన్ శ్రీధర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. తాజాగా యోగితా రాణాను సెక్రెటరీగా నియమించడంతో శ్రీధర్‌ను ఆ బాధ్యతల నుంచి విద్యాశాఖ రిలీవ్ చేసింది. కాగా, ఎన్. శ్రీధర్‌కు గనుల శాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. అదేవిధంగా 2006 బ్యాచ్‌కు చెందిన కే. సురేంద్ర మోహన్‌ను రవాణా శాఖ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశాలు జారీచేశారు. యోగితా రాణా.. 2003 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారిణి. 2002లో సివిల్ సర్వీసెస్‌లో మూడో ప్రయత్నంలో ఐఆర్‌టీఎస్‌కు ఎంపికయ్యారు. 2003లో సివిల్స్‌లో నాలుగో ప్రయత్నంలో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించడంతో విశాఖ జిల్లాలో ఏడాదిపాటు శిక్షణ తీసుకున్నారు. అనంతరం భద్రాచలం సబ్ కలెక్టర్‌గా, రంపచోడవరం ఐటీడీఏ పీఓగా పనిచేశారు. ఆ తర్వాత యూఎన్‌డీపీలో మూడున్నరేండ్లు బాధ్యతలు నిర్వహించారు. 2017లో నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తూ 'ఈ–నామ్' అమలులో జాతీయ స్థాయిలో ప్రధాని మోదీ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు.

## నీటి సంపులో పడి కూలీ మృతి

జగిత్యాల,జనవరి 9 శాసనసభ
బతుకుదెరువు కోసం వలస వచ్చిన ఓ కూలీ నీటి సంపులో పడి అర్ధాంతరంగా తనువు చాలించాడు. ఈ విషాదకర సంఘటన జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మాదాపూర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బిహార్ రాష్ట్రానికి చెందిన వలస కూలీ సచిన్ చౌదరి(38) కొద్ది రోజుల నుంచి స్థానిక శివరామకృష్ణ ఆగ్రో ఇండస్ట్రీ రైల్ మిల్లులో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో అతను బాయిలర్‌కు వాడే నీటి సంపు వద్ద వద్ద కూర్చొని ఉండగా ప్రమాదవశాత్తు నీటిలో జారిపడి దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఫార్ములా కేసులో ముగిసిన కెటిఆర్ విచారణ

. ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరుకావాలని ఏసీబీ అధికారులు సూచించారు. ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసులో పెద్ద మొత్తంలో నిధుల చెలామణీ, అన్యాయంగా ఆర్థిక లావాదేవీలు జరగడం వివాదంగా మారింది. ఈ వివాదంలో కేటీఆర్ ప్రధాన నిందితుడిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో విచారణకు ఎప్పుడు పిలిచినా కూడా రావాలని ఏసీబీ తెలుపగా, కేటీఆర్ వస్తానని చెప్పారు. కేటీఆర్‌కు ఈ కేసులో అనేక ఆరోపణలు వచ్చాయి, అవి నిరూపించడానికి ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. గత కొన్ని రోజులుగా ఈ కేసు చుట్టూ కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. కేటీఆర్‌ను ముగ్గురు ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. అరవింద్ కుమార్, దానకిషోర్ ఇచ్చిన స్టేట్‌మెంట్స్ ఆధారంగా ఈ విచారణ జరగింది. ఫార్ములా ఈ కార్ రేసింగ్ ప్రాజెక్టులో నియమాలను ఉల్లంఘించి రూ.55 కోట్లు ఎఫ్ఈవోకు బదిలీ చేసినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. ఈ అంశంపై ఏసీబీ కేటీఆర్‌ను విచారించింది. అయితే కేటీఆర్ విచారణ సందర్భంగా న్యాయవాదికి అనుమతి ఇవ్వాలని హైకోర్టు ఇప్పటికే ఆదేశించింది. ఈ ఆదేశం ప్రకారం కేటీఆర్ విచారణను అనుసరించి, న్యాయవాది లైబ్రరీలో కూర్చోవడం ద్వారా ఏసీబీ చర్యలు తీసుకుంది. కేటీఆర్–న్యాయవాది సంభాషణలకు విజిబుల్ డిస్టెన్స్‌లో ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ విచారణ తర్వాత కేటీఆర్ స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసేందుకు ఏసీబీ అధికారులు కేటీఆర్‌ను ఆఫీస్‌లో విచారించారు. ఆయనను ప్రధాన నిందితుడిగా పేర్కొనడం, స్టేట్‌మెంట్ రికార్డు చేయడం తదితర చర్యలు తీసుకున్నాయి. దీంతో ఈ కేసు విషయంలో తర్వాత ఎలాంటి పరిణామాలు ఉంటాయేనని రాజకీయ వర్గాలతోపాటు అనేక మంది ఆసక్తితో ఉన్నారు. ఏసీబీ విచారణ అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 'పూర్తి స్థాయిలో ఏసీబీ విచారణకు సహకరించా. నాకున్న అవగాహన మేరకు ఏసీబీ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పా. విచారణకు ఎప్పుడు పిలిచినా, ఎన్ని సార్లు పిలిచినా వచ్చి సహకరిస్తానని చెప్పా. మళ్లీ ఎప్పుడు పిలుస్తారో తెలియదు. ఇది ఒక చెత్త కేసు. రాజకీయ ఒత్తిడితో మీరు ఏం చేస్తున్నారో కూడా మీకే తెలియడంలేదు, పూర్తిగా అసంబద్ధమైన కేసు అని అధికారులకు చెప్పాను. నాలుగైదు ప్రశ్నలనే 40 రకాలుగా అడిగారు.. కొత్తగా అడిగిందేమీ లేదు. పైసలు పంపాను అని నేనే చెబుతున్నాను.. డబ్బులు వచ్చాయని వాళ్ళు చెబుతున్నారు. ఇందులో అవినీతి ఎక్కడ జరిగిందని అడిగా' అని కేటీఆర్ తెలిపారు. కేటీఆర్ మీడియాతో మాట్లాడుతుండగా డీసీపీ విజయ్‌కుమార్ అభ్యంతరం తెలిపారు. మీడియాతో మాట్లాడితే భయమెందుకని కేటీఆర్.. డీసీపీని ప్రశ్నించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతుందని, ఇక్కడ మీడియా సమావేశం పెట్టవద్దని సూచించారు. పార్టీ కార్యాలయంలో ప్రెస్‌మీట్ పెట్టుకోవాలన్నారు. మీడియా ప్రతినిధులను పోలీసులు తోసేయడంతో... కేటీఆర్ అక్కడి నుంచి వెళ్లిపోయారు.అయితే పలు రకాల ప్రశ్నలనే 40 విధాలుగా అడిగారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. అధికారులు అడిగిన ప్రశ్నలకు తాను చెప్పాల్సినది చెప్పినట్లు కేటీఆర్ తెలిపారు. అంతేకాదు ఈ కేసు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని, రేవంత్ చెప్పిన ప్రశ్నలనే అధికారులు అడిగారని కేటీఆర్ అన్నారు. మరోవైపు కేటీఆర్ విచారణ నేపథ్యంలో అరెస్ట్ అవుతారా అని బీఆర్ఎస్ వర్గాలు భయాందోళన చెందాయి.

# కాళిదాసు వారి వీధిలో ముగ్గుల పోటీలు

కందుకూరు, కందుకూరు కాళిదాసు వారి వీధిలో కోదండరామ స్వామి దేవాలయం ఎదురుగా ఉన్న బజారులో ముక్కోటి ఏకాదశి, సంక్రాంతి సందర్భంగా ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాళిదాసు వారి వీధిలో ఉన్న మహిళలు ఉత్సాహంగా ముగ్గుల పోటీలో పాల్గొని కనులకు ఆకట్టుకునే విధంగా ముగ్గులను వేశారు. మన సంస్కృతు లు సాంప్రదాయాలు ఆకట్టుకునే విధంగా ముగ్గులు రంగులతో తీర్చిదిద్దారు. ముగ్గుల పోటీలో పాల్గొన్న వారికి బహుమతులు అందజేశారు.

## టి.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

కందుకూరు,
స్థానిక టి. ఆర్. ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించబడ్డాయి. భోగిమంటలతో ఈ సంక్రాంతి సంబరాలు ప్రారంభించబడ్డాయి. ఇందులో భాగంగా విద్యార్థులచే ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించబడింది. విద్యార్థులు స్వయంగా వండిన అనేక రకాలైన పిండివంటలను ప్రదర్శనలో ఉంచడం జరిగింది. సంక్రాంతి లక్ష్మి, రైతు,పల్లె పడుచు, హరిదాసు,ఎరుకల సోది,గోపిక మొదలగు వేషాలతో విద్యార్థులు ప్రేక్షకులను అలరించారు. ముగ్గుల పోటీలో భాగంగా విద్యార్థులు వేసిన ముగ్గులు చూపరులను కనుల పండుగగా ఆకట్టుకున్నాయి. ఫుడ్ ఫెస్టివల్, వేషధారణ,ముగ్గుల పోటీ మొదలైన పోటీలందు విజేతలైన వారికి ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు ఇవ్వడమే కాక పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులు ఇవ్వడం జరిగింది.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రవి కుమార్ ఈ సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ అభినందనలు తెలియజేయడమే కాక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాలలోని అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

## ప్రతిపక్ష నేతను అడ్డుకోవడం సరైనది కాదు

-:బుర్రా మధుసూదన్ యాదవ్ టీటీడీ మాజీ మెంబర్



కందుకూరు,
సాక్షాత్తు కలియుగ ప్రత్యక్ష దైవం ఏడుకొండల స్వామి సన్నిధిలో తిరుమల తిరుపతి దేవస్థానము నందు జరిగిన దుర్ఘటన అత్యంత బాధాకరమని టీటీడీ బోర్డు మాజీ మెంబర్ బుర్రా మధుసూదన్ యాదవ్ ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్త పరిచారు. నిఘా వర్గాల సమాచారం ఉన్నప్పటికీ అలక్ష్యంగా వ్యవహరించిన కూటమి ప్రభుత్వం, టీటీడీ బోర్డు చైర్మన్ ల తప్పిదమే ఇది అని నొక్కి ఒక్కనించారు. అధికారులు మీద సాకు చూపించి తప్పించుకోవాలని చూస్తున్నారు.ఇది ముమ్మాటికి మానవ తప్పిదమే. క్షతగాత్రులను పరామర్శించడానికి వచ్చిన ప్రతిపక్ష నేత వైయస్ జగన్ కు అడ్డంకులు కల్పించడం సరైనది కాదు అని, మృతులకు కోటి రూపాయల ఎక్స్గ్రేషియా అందించాలని, ఆసుపత్రిలో ఉన్న వారికి మెరుగైన వైద్య సహాయంతో పాటు ఆర్థిక సహాయం అందించాలని ఈ సందర్భంగా కోరారు.



# చండూరు తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

చండూరు జనవరి 9 (శాసనసభ న్యూస్ ):
నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపార్టి చండూరు తహసిల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధరణి ఫైళ్లను, ధరణి పోర్టల్ ను పరిశీలించి పెండింగ్లో ఉన్న దరఖాస్తులు, ఇప్పటి వరకు ధరణి ద్వారా పరిష్కరించిన సమస్యలు, తదితర వివరాలను పరిశీలించారు. ధరణి ద్వారా వచ్చే దరఖాస్తులన్నింటిని పెండింగ్లో ఉంచకుండా పరిశీలించి పరిష్కరించాలని చెప్పారు. ముఖ్యంగా ధరణి మాడ్యూల్స్ అన్నింటిపై తహసిల్దార్లు పూర్తి అవగాహనతో సమస్యలను పరిష్కరించాలని, క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా తనిఖీ చేసే వాటిని క్షేత్ర స్థాయి సందర్శన తర్వాతే పరిష్కారం చేయాలని, భూ సమస్యల పరిష్కారంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ముఖ్యమైన సమస్యలపై ఆర్డీవో సైతం పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని చండూర్ ఆర్డీవో శ్రీదేవిని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భూ సమస్యలపై తహసిల్దార్ కార్యాలయానికి వచ్చిన రైతులతో మాట్లాడారు.

## బలుగూరి వెంకమ్మ చిత్రపటానికి ఘన నివాళి అర్పించిన - నల్లగొండ జిల్లా సగర సంఘం




చండూర్ జనవరి 9 (శాసనసభ న్యూస్):
నాంపల్లి మండలం నర్సింహులగూడెం గ్రామానికి చెందిన బలుగూరి వెంకమ్మ దశదిన కార్యక్రమంలో నల్లగొండ జిల్లా సగర సంఘం నాయకులు, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని ఆమె మృతికి సంతాపం తెలుపుతూ ఘనంగా నివాళి అర్పించారు.

# తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ మహిళా ప్రధాన కార్యదర్శిగా గుండేమోని జయమ్మ

ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 9

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ మహిళా ప్రధానకార్యదర్శిగా గుండెమోని జయమ్మను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షురాలు సునీత రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఆమె చేతుల మీదుగా గాంధీభవన్‌లో నియామక పత్రాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. గుండెమోని జయమ్మ రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా పనిచేసింది. జయమ్మ రంగారెడ్డి జిల్లాలోని మంచాల మండలం ఎల్లమ్మ తండా గ్రామానికి చెందింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కమిటీలో చోటు దక్కడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం కాంగ్రెస్ అధిష్టానానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

దశలవారీగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తుందని తెలిపారు.



# లడ్డూను రాజకీయం చేసినందుకే ఈ దుర్ఘటన

## తిరుపతి తొక్కిసలాటపై మాజీమంత్రి గుడివాడ దిగ్భ్రాంతి

విశాఖపట్నం,జనవరి 9 శాసనసభ
తిరుపతిలో తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు మృతిచెందడంపై మాజీ మంత్రి, వైసీపీ అగ్రనేత గుడివాడ అమర్నాథ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ..తీవ్రంగా స్పందించారు. గురువారం విశాఖలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. తిరుపతి తొక్కిసలాట ఘటన బాధకరమని అన్నారు. ఈ ఘటన చాలా దురదృష్టకరం.. దీనికి ప్రభుత్వం బాధ్యత వహించాలి.. ఎక్స్‌గ్రేషియో కోటి రూపాయలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. లడ్డూని రాజకీయం చేశారు.. అందుకే ఇలాంటి పరిణామాలు జరుగుతున్నాయని భక్తులు భావిస్తున్నారని అన్నారు. ఇందుకు కారణమైన వారి మీద కఠినంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మృతుల కుటుంబాలకు వైసీపీ తరపున ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నామని గుడివాడ అమర్నాథ్ అన్నారు. మోదీ భజన మానేసి తిరుపతిలో భక్తుల, సౌకర్యాల మీద దృష్టి పెడితే ప్రాణాలు పోయేవి కాదని అన్నారు. గతంలో పవన్ కల్యాణ్ సనాతన దీక్ష, హిందూ ధర్మ దీక్ష చేశారు ఇప్పుడు ఏ దీక్ష చేస్తారో చూస్తామని అన్నారు. ఈ పాప పరిహారం ఎలా సరిదిద్దుకుంటారో, సనాతన ధర్మాన్ని కాపాడే నాయకుడు ఇప్పుడేం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ఎ÷–లాంట్ గురించి ప్రధానమంత్రి నరేంద్రమోదీతో స్పష్టమైన ప్రకటన ఎందుకు ఇప్పించలేదని ప్రశ్నించారు. నిన్న మోదీ ఏపీకి ఎలాంటి హామీలు ఇవ్వలేదన్నారు. ఏపీ అభివృద్ధిపై మోదీ కట్టుబడి ఉన్నారా అని నిలదీశారు. గ్రీన్ హైడ్రోజన్, బల్క్ డ్రగ్ పార్క్ ఈ ప్రాజెక్టులు అన్ని మెజార్టీ గతంలోనివేనని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విశాఖపట్నానికి కొత్తగా ఏం తెచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. నిన్న సమావేశంలో ప్రధాని మోదీ భజన తప్పితే, ఏం కనిపించలేదని విమర్శించారు. స్టీల్ ఎ÷–లాంట్ గురించి కనీసం ఒక మాట.. ఎందుకు మాట్లాడలేదని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ నిలదీశారు.

## తొక్కిసలాట ఘటనపై జగన్ దిగ్భ్రాంతి మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి

అమరావతి,జనవరి 9 శాసనసభ న్యూస్
తిరుపతి తొక్కిసలాట ఘటనపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీవారి భక్తులు మృతి చెందడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. ఈ దుర్ఘటనలో గాయపడ్డవారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వైకుంఠ ఏకాదశి దర్శనం కోసం వచ్చిన భక్తులు ఇలా ప్రాణాలు కోల్పోవడం అత్యంత విచార కరమని అన్నారు. తక్షణం అక్కడ పరిస్థితులను చక్కదిద్దడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న భక్తులు త్వరగా కోలుకోవాలని వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు.తొక్కిసలాట జరిగి భక్తులు మరణించడం తిరుపతి ఆలయ చరిత్రలోనే ఇది తొలిసారి. గాయపడ్డవారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని అధికారులను కోరారు.

# ఎపి అప్పుడూ..ఇప్పుడూ ఐటి కేంద్రమే

## డిజిటల్ టెక్నాలజీ సదస్సులో కేంద్రమంత్రి రామ్మోహన్

విశాఖపట్నం,జనవరి 9(శాసనసభ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ ఎప్పుడూ ఐటీకి కేంద్రంగా ఉందని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు అన్నారు. విశాఖపట్నంలో నిర్వహించిన ఏపీ డిజిటల్ టెక్నాలజీ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 'సీఎం చంద్రబాబు ఐటీతో పాటు డీప్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ప్రమోట్ చేస్తున్నారు. దీనికి ప్రధాన కేంద్రంగా విశాఖను తయారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఎక్కడికి వెళ్లినా విశాఖను టెక్ హబ్‌గా ప్రమోట్ చేస్తున్నారు. బుధవారం ప్రధాని మోదీ రూ.2 లక్షల కోట్ల అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. లోకేశ్ కృషితో విశాఖలో టీసీఎస్ కార్యకలాపాలు ప్రారంభించనుంది. గూగుల్ కూడా పెట్టుబడులు పెట్టనుంది. హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ వచ్చాకే అభివృద్ధి ఒక స్థాయిలో పెరిగింది. విశాఖకు బహుళ జాతి సంస్థలు పెట్టుబడులతో వస్తే నగరం బాగా అభివృద్ధి చెందుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ, ఉత్తరాంధ్రపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. భవిష్యత్తులో ఈ నగరాన్ని ప్రపంచానికే గర్వ కారణంగా నిలిచేలా తీర్చిదిద్దుతాం. పౌర విమానయాన శాఖ తరపున డ్రోన్ టెక్నాలజీ, ఏవియేషన్‌లో ఏపీకి ప్రాధాన్యత ఇస్తున్నాం' అని రామ్మోహన్‌నాయుడు చెప్పారు.

# అమల్లోకి వచ్చిన భూభారతి చట్టం

ఇందులో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలందరి అభిప్రాయాలను క్రోడీకరించి సామాన్యుల సంక్షేమమే ధ్యేయంగా భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు వివరించారు. ఈ చట్టానికి సంబంధించిన విధి విధానాలను రూపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. డిసెంబర్ 20వ తేదీన భూభారతి బిల్లును తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన విషయం తెలిసిందే. అనంతరం డిసెంబర్ 30వ తేదీన గవర్నర్ కార్యాలయానికి భూభారతి బిల్లు చేరింది. ఈరోజు భూభారతి చట్టానికి ఆమోదం తెలుపుతూ గవర్నర్ నిర్ణయం తీసుకున్నారు. దీంతో త్వరలోనే భూభారతి మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయనుంది. మార్గదర్శకాలపై సర్కార్ కసరత్తు చేస్తోంది. ఆర్వోఆర్ – 2020 వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం గత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా విచ్ఛిన్నం చేసిందని విమర్శించారు. కొందరికి సేవ చేయడానికి మాత్రమే పరిమితమైన రెవెన్యూ సేవలను అందరికీ అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ పేర్కొన్నారు. కాగా... ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణిని రద్దు చేసి భూభారతి పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. ర్వోఆర్–2020ను కూడా పూర్తిగా ప్రక్షాళన చేస్తూ.. ప్రభుత్వం ఈ కొత్త చట్టాన్ని తీసుకువచ్చింది. ధరణి స్థానంలో కొత్తగా భూ భారతి చట్టం అమల్లోకి రానుంది. గత ఏడాది డిసెంబర్ 18న భూభారతి చట్టం బిల్లును మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలంగాణ అసెంబ్లీలో ప్రవేశపెట్టగా.. అదే నెల 20, 21 తేదీల్లో శాసనసభ, మండలి ఆమోదం తెలిపింది. ఆపై గర్నవర్‌కు ఈ బిల్లును పంపగా.. ఈరోజు భూభారతికి ఆమోదం తెలిపారు గవర్నర్. భూభారతితో రైతులకు ప్రయోజనం చూకూరుతుందని ఇది వరకే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ తెలిపారు. గత ప్రభుత్వంలో కొందరి గుప్పిట్లోనే పరిమితమైన రెవెన్యూ సేవలను గ్రామస్థాయి వరకు విస్తరించడానికి తమ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వివరించారు. గ్రామాలలో రెవెన్యూ సేవలు అందించేందుకు ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించబోతున్నామని, ఇప్పటికే కసరత్తు కొలిక్కి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వ ఆలోచనల కు అనుగుణంగా రెవెన్యూ విభాగం పనిచేయాలన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఇందిరమ్మ ప్రభుత్వం పనిచేస్తోందని.. రెవెన్యూ వ్యవస్థను ప్రజలకు చేరువ చేయాలన్నదే తమ ప్రభుత్వ ఆకాంక్ష అని స్పష్టం చేశారు. ప్రత్యేక వెబ్‌సైట్‌ను మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన 95శాతం పూర్తయిందని మంత్రి తెలిపారు. జీహెచ్‌ఎంసీలో 88శాతం దరఖాస్తుల పరిశీలన పూర్తి అయ్యిందని వివరించారు.





# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే

కావలి,
లఅనారోగ్యంతో బాధపడుతూ వివిధ హాస్పిటల్ లో చికిత్స పొందిన 10 మంది లబ్ధిదారులకు సంబందించిన రూ.9,88,831 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను గురువారం కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి గురువారం అందజేశారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్ టిఆర్ వైద్యసేవ కిందకు రాని పలు ఆరోగ్య సమస్యలకు వివిధ హాస్పిటల్ లలో చికిత్సలు పొందటం జరిగిందని, వారికి ఇంటి పెద్ద బిడ్డగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్థిక సహాయం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కావలి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు,టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు,మాజీ చైర్ పర్సన్ పోతుగంటి అలేఖ్య, మరియు వార్డ్ ఇన్చార్జిలు తదితరులు పాల్గొన్నారు.



# తల్లి బిడ్డ ఆరోగ్యంగా వుండాలి

## - డాక్టర్ లక్ష్మి

కావలి,
ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ పథకము క్రింద డాక్టర్ రామ్ సెంటర్ విశ్వోదయ సహకారంతో కావలి రాజీవ్ నగర్ పి.హెచ్. సి ఆధ్వర్యంలో గురువారం రోజున గైనకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మి గర్భవతులకు, బాలింతలకు వైద్య పరీక్షలునిర్వహించారు.గైనకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ గర్భవతులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని,మాతృమరణాలు,శిశు మరణాలు లేకుండా చూడడం ఈపథకం ఉద్దేశం అని, గర్భవతులకు అనేక వైద్య సలహాలు ఇచ్చారు. తల్లి బిడ్డ ఆరోగ్యంగా వుండాలి అన్నారు.సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగించారు,డాక్టర్ రామ్ సెంటర్ డైరెక్టర్ కూనం తాతిరెడ్డి మాట్లాడుతూ గర్భవతులు మూఢనమ్మకాలు పెట్టుకోకుండా వైద్యుల సలహాలు పాటించాలని , పౌష్టికాహారం తీసుకోవాలని, రక్తహీనత లేకుండా చూచుకోవాలని, ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మ నివ్వాలని కోరారు. సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి మాట్లాడుతూ లింగ వివక్షత, బాల్య వివాహాల వలన నష్టాలపై అవగాహన కల్పించారు.ఈకార్యక్రమంలో %ూఎజ% కమ్యూనిటి ఆర్గనైజర్ సునీత, ఎ.యన్.యం లు , ఆషావర్కర్లు , గర్భవతులు , బాలింతలు పాల్గొన్నారు.తదుపరి డాక్టర్ రామ్ సెంటర్, విశ్వోదయ వారు ఐరన్ పొలిక్ సిరపులు పంపిణీచేశారు.





# కిషోరి వికాసం మండల స్థాయి శిక్ష కులశిక్షణ





వల్లేటివారిపాలెం అమరావతి జ్యోతిమండల స్థాయి శిక్షకుల శిక్షణ కార్యక్రమమును చుండి పి.ఏం శ్రీ మోడల్ స్కూల్ నందు లైన్ డిపార్ట్మెంట్ సీడీపీఓ శర్మిష్ట అధ్యక్షతన నిర్వహించడం జరిగినది.ఈ కార్యక్రమమునకు వీవీ పాలెం మండల స్థాయి అధికారులు ఎమ్మార్వోఎస్.కె హమీద్ ఎంపీడీవోకెనరేంద్ర దేవ్ ఎస్సైమరిది నాయుడు ఎంఈఓ . మల్లిఖార్జున వివిపాలెం పీహెచ్ డాక్టర్ .మణిదీపిక ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పి వెంకటేశ్వర్ ,సిహె .శ్రీనివాసరావు ,ఐసిడిస్ సూపెర్వైసోర్ సునీత గారు,హెల్త్ సూపెర్వైసోర్స్ పద్మావతి నవమని ఏపిఎం మోడల్ స్కూల్ ఇంగ్లీష్ టీచర్ హిమబిందు యోగ టీచర్ కుమారి ఎంశ్రీలత డి .అనుష మహిళా పోలీసులు ఏఎన్ఎంఎస్ , సచివా లయం వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్,స్కూల్ టీచర్లు ,అంగన్వాడి కార్యకర్తలు హాజరు కావడం జరిగినది.ఈ కార్యక్రమములో భాగంగా ఎమ్మార్వో బాల్య వివాహాలు నిర్మూలించడం గురించి,ఈ కార్యక్రమం యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు ఎంపీడీవో బాల్య వివాహాలు,కిషోరి వికాసం కార్యక్రమం ముఖ్య ఉద్దేశం వివరించారు. ఎస్సై బాలాల హక్కులు , పి ఓ సిఎస్ చట్టము,సైబర్ నేరము లు వాటిని ఎదుర్కోవటానికి ఉన్న హెల్ప్ లైన్ గురించి వివరించారు.పీహెచ్ డాక్టర్ ఈ కార్యక్రమం ప్రతి ఒక్క కిషోరి బాలికలకు అందజేయాలని సూచించారు.సిడిపీఓ కిషోరి వికాసము యొక్క ప్రాముఖ్యత గురించి మరియు ఈ రోజు శిక్షణ పొందిన వారు 20 మంది కిషోరి బాల బాలికతో గ్రూప్ ఏర్పడి వారికి కౌమార ప్రయమో లో వచ్చే సమస్యలు,ఆరోగ్యమైన నేను,నా పోషణ అవసరాలు,పిల్లల సంరక్షణ, సంధాన కర్త నైపుణ్యములను కిషోర బాల బాలికలలో సెన్సిటిజ్ చేసి,పిల్లల్ని శారీరికంగా ,మానసికముగా మరియు చట్టముల మీద అవగాహన మరియు పోషణ అవసరాలపై వారిని బలపరచవలేనని సూచించారు. ఈ కార్యక్రమములో భాగముగా హెల్ప్ లైన్ నెంబర్ ల పోస్టర్ ఆవిష్కరించడం జరిగినది.మరియు కౌమార బాలబాలికలు 6 పుస్తములతో కూడిన కిట్ ఆవిష్కరించడం జరిగినది.పిల్లలు యోగ మరియు సెల్ఫ్ డిఫెన్స్ రోల్ ప్లే నిర్వహించడం జరిగినది.

# వరి పంట బీమా చేసుకొనుటకు 15 వరకు గడువు పొడిగింపు

గుడ్లూరు, మండలంలోని చెమిడితిపాడు, చేవూరు గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి బి. రవికుమార్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది మరియు పొలంబడి కార్యక్రమాలను నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి బి. రవికుమార్ మాట్లాడుతూ వరి పంటకు గాను పంట భీమా ఈ నెల అనగా 15/01/2025 వరకు పొడిగించబడినది కావున బ్యాంక్ లలో పంట ఋణము తీసుకోని రైతులు తప్పనిసరిగా పంట భీమా చేయించుకోవలసినదిగా మనవి. ఒక ఎకరాకు 168 రూపాయలు మాత్రమే చెల్లించవలసి ఉంటుంది. దీనికిగాను ఏదేని ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంట నష్ఠ%శీ% సభవించినప్పుడు 42000 రూపాయాలవరకు పరిహారం అందుతుంది కావున తప్పనిసరిగా పంట భీమా చేయించుకోవలసినదిగా మనవి. ఈ కార్యక్రమములో ముఖ్య అతిధిగా సహాయ వ్యవసాయ సంచాలకులు కందుకూరు అనసూయ , చిమిడితిపాడు , గ్రామ ఉద్యాన సహాయకులు స్వర్ణ , గ్రామ వ్యవసాయ సహాయకులు రఘు, గ్రామనాయకులు మరియు రైతులు పాల్గొన్నారు.






# విద్యుత్ చౌర్యం చేస్తున్న 17 మందికి నోటీసులు

ఉలవపాడు, జనవరి :-09
ఉలవపాడు మండలం లోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్,విజిలెన్స్ ఒంగోలు వారి ఆధ్వర్యంలో 34 బృందాలుగా ఏర్పడి 2500 సర్వీసులు తనిఖీ చేయడం జరిగింది.ఇందులో 150 మంది అధిక లోడు వాడుచున్నట్లు గుర్తించి వారికి నోటీసులు ఇవ్వడం జరిగింది.మరియు విద్యుత్ చౌర్యం చేస్తున్న 17 మందిని గుర్తించడం జరిగింది.మరో 3 సర్వీసులు మాల్ ప్రాక్టీస్ క్రింద కేసులు నమోదు చేసి మొత్తం 80,1000/- ఫైన్ క్రింద విధించడం జరిగినది. ఈ యొక్క కార్యక్రమంలో విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి. హైమావతి మరియు పి. యుగంధర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పువ్వాడ శ్రీనివాసులు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉలవపాడు మరియు కందుకూరు డివిజనల్ లో, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కందుకూరు టౌన్ మరియు రూరల్ మరియు ఏ, ఇ, లు, వారి సిబ్బంది పాల్గొన్నారు.

# నలంద స్కూల్స్ స్పోర్ట్స్ మీట్ ను ప్రారంభించిన శాసనసభ్యులు "దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి"

కావలి,
విక్రమ సింహపురి యూనివర్సిటీ పీజి సెంటర్ లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.జాతీయ జెండాను, నలంద స్కూల్ క్రీడా జెండాను ఆవిష్కరించారు. జ్యోతి ప్రజ్వలన చేసి, క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించారు. సరదాగా విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆడారు..



# చాగంటి వెంకయ్య ఉత్తరక్రియులో పాల్గొన్న కావలి ఎమ్మెల్యే





కావలి , శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 9
కావలి రూరల్ మండలం చలంచర్ల గ్రామానికి చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు చాగంటి వెంకటేశ్వర్లు సోదరుడు చాగంటి వెంకయ్య ఉత్తరక్రియల కార్యక్రమం బుధవారం చలంచర్ల గ్రామంలో జరిగింది. ఈ కార్యక్రమంలో కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పాల్గొని వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు ,తదితరులుపాల్గొన్నారు.

# మల్టీ సర్వీసెస్ షాప్ ను ప్రారంభించిన శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు



కందుకూరు,
కందుకూరు పట్టణంలోని మునిసిపల్ ఆఫీస్ రోడ్ లో నిర్వాహకులు ఏండ్లూరి కాంతారావు ఆహ్వానం మేరకు వెంకట సాయి మల్టీ సర్వీసెస్ నూతన షాప్ ను కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. ముందుగా నిర్వాహకులు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావుకి ఘన స్వాగతం పలికారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎండ్లూరి కాంతారావు శుభాకాంక్షలు తెలియజేసి, వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు..ఈ కార్యక్రమంలో రాయపాటి శ్రీనివాసరావు, చదలవాడ కొండయ్య, గోచిపాతల మోషే, బద్దిపూడి శిఖామణి, మరియు ఇతర నేతలు పాల్గొన్నారు..

# సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు, 2024-2025 ఆర్థిక సంవత్సరమునకు గాను బీసీ, కాపు, ఈబీసీ కులములకు చెందిన అర్హత గల లబ్ధిదారులు సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం లిమిటెడ్ అధికారి నిర్మలాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా 1328 యూనిట్లు, ఈబీసీ కార్పొరేషన్ ద్వారా 91, కమ్మ కార్పొరేషన్ ద్వారా 100 యూనిట్లు, రెడ్డి కార్పొరేషన్ ద్వారా 140, ఆర్యవైశ్య కార్పొరేషన్ ద్వారా 41 యూనిట్లు, క్షత్రియ కార్పొరేషన్ ద్వారా 6 యూనిట్లు, బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా 32 యూనిట్లు, కాపు కార్పొరేషన్ ద్వారా 231 యూనిట్లు మంజూరైనట్లు చెప్పారు. 50శాతం సబ్సిడీతో ఈ రుణాలను మంజూరు చేయనున్నట్లు చెప్పారు. అలాగే జనరిక్ మందుల దుకాణాల ఏర్పాటుకు కూడా సబ్సిడీ రుణాలు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. ఎంఎస్ఎంఈ బ్యాంక్ లింక్డ్ యూనిట్లకు రూ.25 లక్షల లోపు సబ్సిడీతో రుణాలు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. అర్హత గత జిల్లాలోని బిసి, ఈబీసీ, కాపు కులములకు చెందిన లబ్ధిదారులందరూ తమ రేషన్‌కార్డు, ఆధార్, ఆదాయ, కుల ధ్రువీకరణ, జనన ధ్రువీకరణ పత్రములతో ఎపిఓబిఎంఎంఎస్ పోర్టల్ ఓపెన్ కాగానే నమోదు చేసుకొనుటకు సిద్ధంగా వుండాలని ఆమె తెలిపారు.

# పేదలకు ఇళ్ల స్థలాలు పక్క గృహాలు మంజూరు చేయాలి

## -తహశీల్దార్ కార్యాలయం జరిగే సీపీఐ ధర్నా ను జయప్రదం చేయాలి....-డి.రాజాసాహెబ్....

## - ఇచ్చిన మాటను చంద్రబాబు నిలబెట్టుకోవాలి - సీపీఐ....




పత్తికొండ శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 9
పత్తి కొండ:ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు స్వంత గృహం లేక అద్దెలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్న నిరు పేదలకు ఇంటి స్థలాలు ప్రభుత్వ పక్క గృహాలు మంజూరు చేయాలని, పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇచ్చి గృహ నిర్మాణానికి ఐదు లక్షలు మంజూరు చేయాలని సిపిఐ పత్తికొండ మండల కార్యదర్శి డి రాజా సాహెబ్ డిమాండ్ చేశారు. ఇళ్లులేని నిరు పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, కూటమి సర్కారు ఎన్నికల్లో ఇచ్చిన ఇళ్ల స్థలాల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో గురువారము మండల కార్యదర్శి డి రాజా సాహెబ్ జిల్లా సమితి సభ్యులు కారన్న పట్టణ కార్యదర్శి రామాంజనేయులు తో కలిసి పత్తికొండ పట్టణంలో కమ్మరిగిరి మడ్డి గేరి కటిక వీధి ఎస్సీ కాలనీ వివిధ ప్రాంతాల్లో తిరిగి అర్హులైన నిరుపేదలు ఇంటి స్థలం లేని వారు పక్క గృహం లేనివారు ప్రభుత్వానికి వ్యక్తిగత ఇచ్చి మాకు ఇంటి స్థలం ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ అచ్చులు సమర్పించుట నిరసన ధర్నాకు నిరుపేదలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డి.రాజా సాహెబ్మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇళ్ళు లేని పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు,గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలాలు కేటాయిస్తామన్న వాగ్దానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన జగనన్న నివేశనా స్థలాల లబ్ధిదారులకు పట్టణాల్లో సెంటుకు బదులుగా రెండు సెంట్లు,గ్రామాల్లో సెంటున్నరకు బదులు మూడు సెంట్లు ఇస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ నెరవేర్చాలని కోరారు.అలాగే గృహ నిర్మాణానికి 5 లక్షలు రూపాయలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జగన్ ఇచ్చిన ఇళ్ల స్థలాల భూ సేకరణలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అప్పటికీ ప్రభుత్వం దిగిరాక పోతే ఇళ్ల స్థలాల సాధన సమితి ఏర్పాటు చేసి పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. చాలీ చాలని కూలీలు వేతనాలతో బ్రతుకుతున్న పేదలు అద్దెలు కట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారికి సత్వరమే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు కోరుతూ దశలవారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి సిద్దు ఏఐవైఎఫ్ నాయకులు ఉపేంద్ర అబ్బాసు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ మహాయోగి నరసింహ స్వామి 82వ ఆరాధన మహోత్సవాలు, రథోత్సవం

పత్తికొండ శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 9
పత్తికొండ:పత్తికొండ శ్రీ మహాయోగి నరసింహ స్వామి దేవాలయ ఆవరణలో రథోత్సవాన్ని నిర్వాహకులు గురువారం వైభవంగా నిర్వహించారు. 82వ ఆరాధన మహోత్సవాల్లో భాగంగా రథోత్సవాన్ని నిర్వహించారు. పత్తికొండ హొసూరు,రామచంద్రపురం, పెద్దహులతి,పుచ్చకాయలమడ గ్రామాల నుంచి మహిళలు, పిల్లలు భారీ ఎత్తున తరలివచ్చారు. రథోత్సవాన్ని పురస్కరించుకుని గాజులు, మిఠాయి, పిల్లల ఆట వస్తువులు, రంగులరాట్నాలు, టెంకాయలు, పూలు, పండ్లు, హోటల్లు ఐస్ క్రీమ్ బండ్లు వేలేసాయి

# బసినేపల్లిలో రూ.1.50 లక్షల విలువైన వజ్రం లభ్యం



పత్తికొండ శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 9 గురువారం 09పత్తికొండ పత్తికొండ నియోజకవర్గం మద్దికెర మండలంలోని బసినేపల్లిలో ఓ వ్యవసాయ కూలీకి వజ్రం లభ్యమైంది. గ్రామంలో వ్యవసాయ తోటలో పనులు చేస్తుండగా వజ్రం లభ్యం కావడంతో పెరవలికి చెందిన ఓ వ్యాపారికి రూ.1.50 లక్షలకు అమ్మినట్లు తెలిసింది. ప్రతి ఏడాది ఈ ప్రాంతాల్లో వజ్రాలు లభ్యం కావడం సర్వసాధారణం. వ్యవసాయ కూలీకి వజ్రం లభించడంతో వారి ఇంట్లో ఆనందం నెలకొంది

# తిరుమలలో జరిగిన ఘటపై తీవ్రద్రిక్బాంతిని వ్యక్తం చేసిన ఆదోని టీడీపీ మాజీ ఇంచార్జ్ గుడిసె అది కృష్ణమ్మా..




.తిరుపతి శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 9
తిరుమల:తిరుపతి శ్రీవారిని వైకుంఠ ఏకాదశి రోజు దర్శించుకోవాలని టోకెన్లు తీసుకునేలోపే
ఈ ఘటనలో మరణాలు చోటు చేసుకోవడం దురదృష్టకరం,అన్ని టీడీపీ మాజీ ఇంచార్జ్ గుడిసె అది కృష్ణమ్మా వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా గుడిసె అది కృష్ణమ్మ మాట్లాడుతూ తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులుమృతి చెందడం ఎంతో బాధాకరం. ఈ విషాద ఘటన పట్ల బాధితుల కుటుంబాలనుటీడీపీ రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు 25 లక్షల పరిహారం ప్రకటించారు అని ఆమె అన్నారు.ఈ ఘటనకు సంబంధించి భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అన్ని పటిష్ట చర్యలు చేపట్టాలని ఆమె కోరారు ఈ కార్యక్రమం లో వడ్డెమన్ గోపాల్ పాలుగోన్నారు.

# ఫాతిమా షేక్ 194వ జయంతి వేడుకలు.




ఉరవకొండ పట్టణంలో హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ నియోజకవర్గ అధ్యక్షులు ముల్లా టైలర్ లాలు సాహెబ్ ఆధ్వర్యంలో ఫాతిమా షేక్ 194వ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక భారతదేశ చరిత్రలో మొట్టమొదటి ముస్లిం ఉపాధ్యాయు రాలిగా ఘనత కి ఎక్కిన చరిత్ర ఆమెది. జ్యోతిరావు పూలే ,సావిత్రి పూలే సమకాలీకరాలుగా సాంఘిక దురాచారాల వ్యతిరేకంగా పోరాటం చేసి విద్యాభివృద్ధి కోసం పాటుపడిన తొలి ముస్లిం మహిళగా పోరిందిన గొప్ప వనితగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో చాబాల గ్రామ సర్పంచ్ మల్లెల జగదీష్, ఆర్ ఎం ఎం అధ్యక్షులు రహంతుల్లా, ఆర్ ఎం ఎం సభ్యులు రఫిక్, మైలారం పల్లి భాష, టైలర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలు షబానా పర్వీన్ ను సత్కరించిన నంద్యాల జమాఆతె ఇస్లామీ మహిళా :




శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 9
జాతీయ తొలి మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ జన్మదినం సందర్భంగా అయ్యలూరు మండల ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో ఇటీవల రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డు అందుకున్న శ్రీమతి షబానా పర్వీన్ ను నంద్యాల జమాఆతె ఇస్లామి హింద్ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఘనంగా శాలువా కప్పి, మెమోంటోతో ఘనంగా సత్కరించారు . జమాఆతె ఇస్లామీ స్థానిక అధ్యక్షులు అబ్దుల్ సమద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.అబ్దుల్ అజీజ్, వరల్డ్ విజన్ ప్రాజెక్టు డైరెక్టర్ తిరుపతి రావ్, జేఐహెచ్ మహిళా బాధ్యులు శ్రీమతి బేగం అమ్తుస్సలామ్, ఫిర్దోష్, ఎస్ఎస్సి ఛైర్మెన్ మాలన్ బీ, టీడిపి అయ్యూబ్ ఉపాధ్యాయులు షబానా, అఖీల బాను, కలీముల్లా, నాగరాజు, వర్ల్డ్ విజన్ స్టాఫ్,జమాత్ మహిళా కార్యకర్తలు, పేరెంట్స్, విధ్యార్థులు పాల్గొన్నారు. ఈ సంధర్భంగా సమద్ మాట్లాడుతూ పంతొమ్మిది శతాబ్ది ప్రారంభంలో ఎన్నో కష్టాలు ఓర్చి దళిత, వెనుక బడిన జాతుల విద్యాభివృద్ధికి కృషి సల్పిన తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ సేవలు ప్రశంసనీయమన్నారు. ఫాతిమా షేక్ జీవిత ఘట్టాలు వివరించారు. జ్యోతిరావు పూలే సావిత్రి బాయిపూలేకు ఆశ్రమం కల్పించిన మహానీయురాలి సేవలు గుర్తించి తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా విద్యాశాఖ ఫాతిమా షేక్ జన్మదినం వేడుకలు నిర్వహించాలని ఆదేశించినట్లు ఆ.ప్ర ముఖ్యమంత్రి కూడా ఆదేశించాలని డిమాండ్ చేసారు. వరల్డ్ విజన్ తిరుపతిరావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా తమ సంస్థ పేద పిల్లలకు సేవలందిస్తున్నది, ఈ నేపధ్యం లో అయ్యలూరు పాఠశాలలో పిల్లలకు గోడుగులు పంపిణి చేసారు. పిల్లలకు ఉన్నత వ్యక్తిత్వం మలచుటలో తల్లిదండ్రులు పాత్ర అధికమని జేఐహేచ్ నాజిమా అమ్తుసలాం, ఫిర్దోష్ పేరెంట్స్ బాధ్యతలు వివరించారు. టీడిపి అయ్యూబ్ పాఠశాల అప్ గ్రేడ్ కు మంత్రిని అభ్యర్థించి కృషి చేస్తామన్నారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ మంచి కార్యక్రమానికి తమ పాఠశాల ఎన్నుకున్నందుకూ వరల్డ్ విజన్, జమాఆతె ఇస్లామి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

# శారద విద్యానికేతన్ పాఠశాల యందు సంక్రాంతి సంబరాలు



శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 9
శారద విద్యానికేతన్ పాఠశాల యందు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నాము ఈ కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు ఇవ్వడం జరిగింది విద్యార్థులకు సంక్రాంతి పండుగ యొక్క ప్రాముఖ్యతను తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొనడం జరిగింది. ఇట్లు కరస్పాండెంట్ కే కాత్యాయని ప్రిన్సిపల్ కేజే ప్రతాప్

# పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఆధ్వర్యంలో.... స్కానింగ్ కొరకు వచ్చే గర్భిణీ స్త్రీలకు ఉచిత భోజన సదుపాయం




పత్తికొండ శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 9
పత్తికొండ:ఈరోజు ప్రభుత్వ హాస్పిటల్ లో స్కానింగ్ డే ప్రతినెల తొమ్మిదో తేదీన గర్భిణీ స్త్రీలకు పత్తికొండ ఎమ్మెల్యే కే ఈ శ్యామ్ కుమార్ గారి ఆధ్వర్యంలో భోజన సదుపాయం ఏర్పాటు చేయడం జరుగుతుంది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రెవిన్యూ డివిజనల్ అధికారి డాక్టర్ భరత్ నాయక్ మరియు ప్రభుత్వ హాస్పిటల్ కమిటీ మెంబర్ బత్తిని లోక నాథ్ మరియు ప్రభుత్వ హాస్పిటల్ సూపర్డెంట్ డాక్టర్ కల్పన గారు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో భరత్ నాయక్ గారు మాట్లాడుతూ ప్రభుత్వ హాస్పిటల్ లో గర్భిణీ స్త్రీలకు ఎమ్మెల్యే గారు భోజన సదుపాయం ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో చందోలు రంగప్ప,ఎరుకలచెరువు సురేంద్ర ,తిక్క రమేష్, చిన్న, దేశాయి రవికుమార్, కప్పే అనిల్ , తదితరులు పాల్గొనడం జరిగింది.

# 'ఫాతిమా షేక్ సేవలు మరువలేనివి'

పత్తికొండ శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 9
పత్తికొండ :భారతదేశ మొట్టమొదటి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ సేవలు మరువలేనివని పత్తికొండ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భ్రమరాంబ అన్నారు. ఫాతిమా షేక్ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఆమె మాట్లాడుతూ.. ఫాతిమా షేక్ దళిత, పేద వారికి విద్యను బోధించారని, బాలిక, స్త్రీ విద్యను ప్రోత్సహించారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు పాల్గొన్నారు.



# కేంద్ర హోం మంత్రి పదవికి రాజీనామా చేయాలి

శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 9
ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి గారి ఆదేశాల మేరకు భారత రాజ్యాంగ రూపశిల్పి సంఘసంస్కర్త అనివారణ వర్గాల ఆర్థిక సామాజిక సాధికారత కోసం జీవితాంతం పరితపించిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి పై పార్లమెంటులో బిజెపికి చెందిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని లిఆలూరు కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ చిప్పగిరి లక్ష్మీనారాయణ గారు అన్నారు. అంబేద్కర్ గారిని అవమానించే విధంగా చేసిన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోని క్షమాపణ చెబుతూ కేంద్ర హోం మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఆలూరు మండల అధ్యక్షులు మొలగవెళ్ళి రామాంజనేయులు, చిప్పగిరి మండల అధ్యక్షులు దేగులపాడు మంజునాథ్, కరెంటు గోవిందు, సీనియర్ నాయకులు తుంబలబీడు లక్ష్మన్న, మీసాల గోవిందప్ప, వరకుమార్, తిమ్మప్ప, నవీన్, వెంకటేష్ మరియు హత్తేబెల్గల్ ఖాదర్ పాల్గొన్నారు.



# ముస్లిం మైనారిటీ కాలనీ లో పర్యటించిన టీడీపీ మాజీ ఇంచార్జ్ గుడిసె ఆది కృష్ణమ్మ

## ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి గారి దృష్టికి తీసుకెళ్లి అతి తొందరలోనే సమస్యలను పరిష్కారం చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చిన గుడిసె కృష్ణమ్మ....



ఆదోని శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 9
ఆదోని :ఆదోని 40ఎలక్షన్ వార్డులో ఉన్నటువంటి మైనారిటీ కాలని లో అనేక సమస్యలు ఉన్నాయి. మురుగునీటి కాలువలు, రోడ్లు కావాలని కాలనీ లో ఉండే మహిళలు డిమాండ్ చేశారు. ఈ మురుగు నీటి కాలువలు లేకపోవడం వల్ల ఎక్కడకక్కడే మరుగునీరు ఆగిపోయి ప్రజలు అనేక రోగాలు పడి బారిన పడుతున్నారు. అదేవిధంగా ఉర్దూ స్కూల్ కి భవనము, మరియు అంగన్వాడీ సెంటర్ ప్రత్యేకంగా కావాలని అక్కడ ఉన్నటువంటి ప్రజలు కోరారు.
వీటన్నింటిని ఎమ్మెల్యే గారు మరియు మున్సిపల్ కమిషనర్ గారు దృష్టికి తీసుకెళ్లి అతి తొందరలోనే సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామని గుడిసె కృష్ణమ్మ వార్డ్ ప్రజలకు హామీ ఇచ్చారు.

# పేదలకు సొంతింటి కల నెరవేరే దాకా పోరాటం ఆగదు

## సిపిఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ బి.గిడ్డయ్య:



శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 9
భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కర్నూల్ నగర సమితి ఆధ్వర్యంలో ఈరోజు కల్లూరు ఎమ్మార్వో కార్యాలయం దగ్గర ధర్నా నిర్వహించడం జరిగినది ఈ ధర్నా కార్యక్రమానికి సిపిఐ నగర సహాయ కార్యదర్శి కామ్రేడ్ దంభోలం శ్రీనివాసరావు గారు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ బి గిడ్డయ్య మాట్లాడుతూ జిల్లాలోని పేదలందరికీ సొంతింటి కల నెరవేరే దాకా సిపిఐ పార్టీ పోరాటం ఆపదని అవసరమైతే ప్రభుత్వ స్థలాలలో జెండాలు పాతి పేదలకు రెండు సెంట్లు ఇంటి స్థలాన్ని పంచుతామని తన ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు గారు ప్రచార సభలో జగన్మోహన్ రెడ్డి గారు పేదలు ఇంటి కల నెరవేర్చడంలో పూర్తిగా విఫలం అయ్యాడని మా ప్రభుత్వం అధికారం లేకుండా వస్తే సొంత ఇల్లు లేని వారికి ఇంటి స్థలం రెండు సెంట్లు ఇస్తామని ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షల రూపాయలు ఇస్తానని హామీ ఇచ్చి పేదల ఓట్లన్నీ వేయించుకొని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు గారు గడిచిన ఏడు మాసాలలో రెండు బడ్జెట్ సమావేశాలు జరిగాయి గాని ఎక్కడ కూడా పేదల ఇంటి నిర్మాణానికి సంబంధించి చర్చించినట్టుగాని బడ్జెట్లో కేటాయింపులు గాని జరగలేదు. దీన్నిబట్టి అర్థమవుతావుంది రాష్ట్ర ప్రభుత్వానికి పేదల పట్ల వారి సమస్యల పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చు కావున రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే దానికోసం కృషి చేయాలని ఆర్ డిమాండ్ చేశారు పేదలు వేసుకుని నివాసముంటున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని అన్నారు
పేదలకు మధ్యతరగతి ప్రజలకు చిన్న కారు ఉద్యోగులకు భారంగా మారిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని వారు డిమాండ్ చేశారు సిపిఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కర్నూలు నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం లైవ్ బళ్లారి చౌరస్తా కొత్త బస్టాండ్ రాజ్ విహార్ సెంటర్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ప్రాంతాలలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని అండర్ డ్రైనేజీ కాలువల నిర్మాణం చేయాలని రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటు చేసి కర్నూలు నగర ప్రజల దాహార్తిని తీర్చాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు
ధర్నా చేస్తున్న సిపిఐ నాయకుల దగ్గరకు వచ్చిన తాసిల్దార్ గారు మాట్లాడుతూ మా పరిధిలో ఉన్న సమస్యలన్నిటిని మేము తక్షణమే పరిష్కరిస్తామని రాష్ట్ర ప్రభుత్వంతో పరిష్కారం అయ్యేటివి పై అధికారులతో మాట్లాడి పరిష్కారం చేస్తానని సిపిఐ నాయకులు ఇచ్చిన వినతి పత్రాన్ని తీసుకొని సిపిఐ నాయకులకు హామీ ఇచ్చారు
ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ నగర సహాయ కార్యదర్శి సి మహేష్ నగర కార్యవర్గ సభ్యులు ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు నగర కార్యవర్గ సభ్యులు సోమన్న మల్లన్న ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మహిళా సంఘం నాయకులు నాగేశమ్మ రబియా రాముడు ప్రజానాట్యమండలి డప్పు కళాకారులు మాణిక్యం కర్ణాకర్ అశోక్ మరియు మహిళలు ఈ ధర్నాలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# దళిత శావల పెద్ద నరసన్న మృతి తీరని లోటు

ఎమ్మిగనూరుశాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 9
నందవరం గ్రామంలోని నిన్నటి దినం రాత్రిన జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఎమ్మిగనూరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శావల సత్యానందం మాదిగ తండ్రి దళిత శావల పెద్ద నరసన్న ఆరోగ్యం క్షీణించిపోయి మరణించడం జరిగింది. ఆయన భౌతికానికి నేడు జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ పూలమాలేసి నివాళులర్పించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండలంలో పెద్ద నరసన్న సేవలు మరువలేము. ఆయన మృతితో దళిత గిరిజనులకు తీరనిలోటని కొనియాడి, రాబోయే రోజుల్లో జై భీమ్ ఎమ్మార్పీఎస్ కార్యకర్తలకు, నాయకులకు ఎటువంటి సమస్య వచ్చిన కూడా ముందుండి పోరాటం చేసి వారికి అండగా నిలబడతామని మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు నియోజకవర్గ టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు మద్రి దావీదు, జై భీమ్ ఎమ్మార్పీఎస్ కర్నూలు జిల్లా కన్వీనర్ గంధాలము మణికుమార్, జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఎమ్మిగనూరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శవల సత్యానందం మాదిగ, జై భీమ్ ఎమ్మార్పీఎస్ నందవరం మండల ఇన్చార్జి చింపిరి చిన్న పోతప్ప మాదిగ,జై భీమ్ ఎమ్మార్పీఎస్ నందవరం మండల కన్వీనర్ పరంపోగు సురేష్ మాదిగ, జై భీమ్ ఎమ్మార్పీఎస్ గోనెగండ్ల మండల కన్వీనర్ వీరపోగు సోమన్న మాదిగ మరియు జై భీమ్ ఎమ్మార్పీఎస్ నందవరం టౌన్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది





# బహు"జను"ల విద్యాబాంధవి

# ఫాతిమా బేగం.

## -నేడు 193 వ జయంతి

ఎమ్మిగనూరుశాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 9
ఆరెకంటి భాస్కర్,దరసం వ్యవస్థాపక అధ్యక్షులు
భారతదేశంలో అసలు చరిత్రను కావాలనే కుట్రపూరితంగా మరుగున పరిచారుస్త్రీ విద్య కోసం అహర్నిశలు శ్రమించిన అసలైన సంఘసంస్కర్తలు ,విప్లవకారులు మహాత్మా జోతిరావు పూలే-సావిత్రి బాయి పూలే దంపతలను మరుగున పరిచి ఎలా అయితే చరిత్ర కారులు వేటగాళ్ళ చరిత్రను గొప్పగా చెప్పడం ప్రారంభించారో మహాత్మా జోతిరావు పూలేకూ చదువులతల్లి సావిత్రి బాయి పూలే కు అడుగడునా అండగా ఉంటూ తోడ్పాటును అందించిన షేక్ ఉస్మాన్ ఖాన్ -ఫాతిమా బేగం దంపతులను గురించి మనకు చరిత్రలో ఎక్కడ కనబడకుండా జాగ్రత్తలు పాటించారు ఈ చరిత్ర కారులు.ఎందుకంటే ముస్లింలు పట్ల ఈ చరిత్ర కారులకు ఎంత వ్యతిరేకత ఉందో అర్థం చేసుకోవాలి. చరిత్ర కారునికి ద్వేషం, పక్షపాతం ఉండకూడదు.చరిత్రలో జరిగిన నిజానిజాలు తప్పనిసరిగా తెలియచేయాలి. అలా కాకుండా కుల కోణం తో ,ఆధిపత్య సంస్కృతి తో పక్షపాత ధోరణి తో రచన చేస్తే అది చరిత్ర ఎలా అవుతుంది?భారతదేశం లో మస్లింలకు ఆధునిక విద్య కోసం కృషి చేసిన సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ కంటే ముందే సర్ షేక్ ఉస్మాన్ ఖాన్-ఫాతిమా బేగం దంపతులు స్త్రీ విద్య కోసం, నిమ్న జాతులలో విద్యా వ్యాప్తి కోసం పాటుపడ్డారు.ముస్లింలలో విద్యావ్యాప్తి కోసం ఈ దంపతులు చేసిన కృషి ఎంతో ఉంది.మహాత్మా జోతిరావు పూలే-సావిత్రి బాయి పూలే లు 1848 లో బాలికల కోసం మొట్టమొదటి పాఠశాల ప్రారంభించారు. నాడు హిందూ సమాజంలో వివక్ష వలన మెజారిటీ ప్రజలు బానిసత్వంలో జీవించారు.చదువు లేదు,కులవృత్తులు చేసుకుని బానిసలుగా జీవించాలి.మూఢనమ్మకాలు ప్రజలకుఅంటగడుతూ ,దేవుని పేరుతో బ్రాహ్మణ ధర్మం మెజారిటీ ప్రజలను దోపిడీ చేసింది.ఈ దుర్మార్గపు బ్రాహ్మణ భావజాలం పై పూలే దంపతులు తిరుగుబాటు చేశారు.ఈ నేపథ్యంలో మత పెద్దలు పూలేను సంఘబహిష్కరణ చేశారు. పూలేను ఇంట్లో నుండి బయటకు గెంటేయాలని మతపెద్దలు పూలే తండ్రి పై ఒత్తిడి తేవడం తో పూలే ఇంటి నుండి తథాగత బుద్ధుని వలె విడిచి పెట్టి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది.పూలే ఇల్లు విడిచి ఎక్కడ జీవించాలో తెలియని కష్టాలు పడుతున్న సమయంలో షేక్ ఉస్మాన్ ఖాన్ చేరదీసి ఆశ్రయం ఇచ్చాడు.చదువులతల్లి సావిత్రి బాయికు ఉస్మాన్ ఖాన్ భార్య ఫాతిమా బేగం పరిచయంఅయింది.ఫాతిమా బేగం కూడా సమాజం పట్ల మంచి ఆలోచన గల మహిళ కావడంతో ఫాతిమా బేగం మరియు సావిత్రి బాయి పూలే లు కలిసి ఫాతిమా బేగం ఇంటి వద్దనే బాలికలకు చదువు అందించడం కోసం పాఠశాల స్థాపించారు.ఫాతిమా బేగం ఉన్నత విద్యను అభ్యసించిన నిస్వార్ధ.సమాజసేవకురాలు.1825-27 కాలంలో షేక్ ఫాతిమా బేగం జనవరి 9 న జన్మించారు.ఉర్దూ భాషలో ఫాతిమా కవిత్వం కూడా వ్రాశారు.ఆనాడే ఫాతిమా బేగం బహుజనులు మరియు ముస్లింలు ఒకే రక్త సంబంధీకులు అన్న వాస్తవాన్ని గుర్తించారు. ఈ దేశంలో ఉన్న ముస్లింలు ఎవరూ కూడా బయటి దేశం నుంచి వచ్చిన వాళ్ళు కాదు. భారతీయులే ఆనాడు బ్రాహ్మణ ధర్మం వలన వివక్షకు తట్టుకోలేక ఇస్లాం మతంస్వీకరించారు.మహారాష్ట్రలో ఫాతిమా బేగం గురించి ఉర్దూ పాఠ్య పుస్తకాలలో వివరించారు.కలకత్తాలోని రోకియా సఖావత్ హుస్సేన్ ముస్లిం బాలికల లో విద్యావ్యాప్తి కోసం షేక్ ఫాతిమా బేగం ను స్ఫూర్తి గా తీసుకుని ఒక పాఠశాల కూడాప్రారంభించారు.మహాత్మా జోతిరావు పూలే కు తన భార్య సావిత్రి బాయి పూలే ఉత్తరం వ్రాశారు.ఆ ఉత్తరం లో ఇలా ఉంది.లిజనవరి 9 ఫాతిమా బేగం జయంతి:
ఫాతిమా నాకు బాగా సహకరించారు.ఆమె సహకారంతో నేను నా సేవా కార్యక్రమాలు కొనసాగించ గలిగానుభారతదేశ ప్రప్రథమ మహిళా టీచర్ సావిత్రి బాయి పూలేతో కలిసి 19వ శతాబ్దంలో బడుగు బలహీన,పేద వర్గాలకు మరియు మహిళలకు చదువు నేర్పిన ముఖ్యంగా పూలే దంపతులకు అన్ని విధాలుగా తోడుగా ఉండిన సావిత్రిబాయి పూలే స్నేహితురాలు ఉపాధ్యాయిని ఫాతిమా బేగం జయంతి ఈరోజు.ముస్లిం సమాజం ఫాతిమా బేగం కృషిని తెలుసుకోవాలి. మొదటి ముస్లిం మహిళా ఉపాధ్యాయిని షేక్ ఫాతిమా బేగం.ప్రభుత్వం సావిత్రి బాయి పూలే, ఫాతిమా బేగం పేర్లతో పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు నెలకొల్పాలి.ఇంగ్లీషు విద్య ప్రాముఖ్యతను ఆనాడే ఈ మహిళా ఉపాధ్యాయినిలు గుర్తించారు.
జై భీమ్ లతో.
ఎ.భాస్కర్,వ్యాసకర్త, ఉపాధ్యాయులు
వ్యవస్థాపక అధ్యక్షులు, దళిత రచయితల సంఘం (ద.ర.సం),ఎమ్మిగనూరు.
సెల్.9441610878




# బాణ రూపదేవికు న్యాయం కావాలి...

## - ప్రజా సంఘాల నాయకుల డిమాండ్.

ఎమ్మిగనూరు శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 9
ఎమ్మిగనూరు పట్టణంలోని స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న న్యూ ఉష టిఫిన్ సెంటర్ ముందు బాణ రూపాదేవి నాకు, నా ముగ్గురు కుమార్తెలకు న్యాయం కావాలని ప్రజా సంఘాల నాయకులతో కలసి ధర్నాకు కూర్చున్నారు. ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల. నరసన్న, ఐఎఫ్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. నరసన్న, ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి అనీఫ్, జయన్న లు మాట్లాడుతూ న్యూ ఉష టిఫిన్ సెంటర్ యజమాని శ్రీరాములు ఇద్దరు కుమారులపైన ఇన్సూరెన్స్ చేయడం జరిగింది, అందులో చిన్న కుమారుడుపై 20లక్షలు ఇన్సూరెన్స్ చేయడం జరిగిందని వాటిని అప్పులు ఎక్కువగా ఉన్నాయని చొప్పి డబ్బులు వాడుకొని అప్పులు కట్టడం జరిగిందని ఆమెకు మోసం చేశాడని, అలాగే తండ్రి ఆస్తులను కూడా ఆయనే ఒక్కడే అనుభవిస్తున్నాడని, అందుకే ఆమె కూతుర్లకు కచ్చితంగా న్యాయం చేయాలని ఉద్దేశంతో రూపా దేవి కు, ముగ్గురు కూతుర్లతో మరియు కుటుంభ సభ్యులతో కలిసి ధర్నా నిర్వహించడం జరిగిందని, రూపా దేవి కు ముగ్గురు కూతుర్ల పేర్లు పైన డిపాజిట్లు కచ్చితంగా చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మోసపూరిత మాటలతో నెలలు గడుస్తున్నాయని ఆమెకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.








# ఆదోని సబ్ కలెక్టర్ వారికి మాదాసి కురువ మదారి కురువ ను కుల గణాల నుండి తొలగించాలని మాలమహానాడు డిమాండ్

శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 9
సబ్ కలెక్టర్ వారిని కలిసి జీవో నెంబర్ 53 ప్రకారం మాదాసి మాదారి కురువ లకు ఎస్సీ కులలిధృవీకరణ పత్రాలు ఇవ్వరాదని మాల మహానాడు డివిజన్ నాయకులు ఆదోని సబ్ కలెక్టర్ గారికి వినతి పత్రం అందించారు హైకోర్టు ఉత్తర్యులను ఉల్లంగించి మాదాసి మాదారి కురువలకు ఎస్సీ కుల ధృవీకరణలి లిప్రకరణ పత్రాలు ఇస్తే వారిపై క్రిమినల్ కేసు తో పాటు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదులిచేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న లిమాలమనాడు నాయకలు రాష్ట్ర అడ్వైజర్ చంద్రయ్య న్యాయవాది రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జై భీమ్లిసాయిరామ్ ఆదోని డివిజన్ నాయకులు బసాపురం ఎల్లప్ప ఆలూరు నియోజకవర్గం భరత్ విజయ్ చాగి గులెప్ప తదితరులు పాల్గొన్నారు.



# సెంట్రల్ లైటింగ్ నూతనంగా ప్రారంభించిన ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి

శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 9
ఎమ్మిగనూరు పట్టణంలోని శ్రీనివాస్ టాకీస్ రోడ్డు నందు విద్యుత్ కాంతలు ప్రారంభించిన ఎమ్మెల్యే బీవీ. నిన్నటి రోజున శివ సర్కిల్ కర్నూల్ బైపాస్ రోడ్డులో ప్రారంభించిన ఎమ్మెల్యే బీవీ కొత్తరోడ్డు తో ఎమ్మిగనూర్ ఏ రోడ్డు చూసిన విద్యుత్ కాంతులే. నూతనంగా ఏర్పాటు చేసిన సెంటర్ లైటింగ్ ను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి చేతులమీదుగా అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మిగనూరు శ్రీ నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా పట్టణంలో విద్యుత్ కాంతులతో వెలుగులు నింపడం జరిగిందన్నారు. పట్టణంలో ప్రతి రహదారి వెలుగులు నింపేలా చర్యలు చేపట్టామన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల నుండి ఈ రహదారులు చీకటి మయంగా ఉండేవని, కూటమి ప్రభుత్వం వచ్చాక సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే పట్టణంలో రహదారుల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, టీడీపీ నాయకులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.





# ఎమ్మిగనూరునారాయణ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు

## ప్రిన్సిపల్ సురేష్ కుమార్.ఏజీఎం. రమేష్ కుమార్ ఘనంగా నిర్వహించారు

ఎమ్మిగనూరుశాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 9
ఎమ్మిగనూరునారాయణ పాఠశాలలో ఏజీఎం రమేష్ కుమార్ ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేసిన హరిదాసు వేషధారణ మరియు సంక్రాంతి సందర్భంగా వండించే వంటకాలు అందరికీ ఎంతగానో ఆకట్టుకున్నాయి.
ప్రతి సంవత్సరము జనవరిలో వచ్చే ఈ పండుగ పంటలకు రైతులకు ఎంతో ఆనందదాయకమని రైతుల పండుగను మన పండుగలుగా భావించే గొప్ప సంస్కృతిని తెలిపే ఈ పండుగను అందరూ ఎంతో సంతోషంగా జరుపుకుంటారని పాఠశాల ప్రిన్సిపల్ సురేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ జాకీర్ హుస్సేన్, వైస్ ప్రిన్సిపల్ అనురాధ మరియు ఇతర పాఠశాల సిబ్బంది పాల్గొని అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.







# ఘాటి కోసం రెబల్ స్టార్..?

యువి క్రియేషన్స్ బ్యానర్ లో తెరకెక్కుతున్న ఘాటి సినిమా ప్రమోషన్స్ కి రెబల్ స్టార్ ప్రభాస్ ని కూడా వాడుకోవాలని చూస్తున్నారట. స్వీటీ అనుష్క సినిమాలంటే ఆమె ఫ్యాన్సే కాదు సినీ లవర్స్ కి కూడా పండగ అన్నట్టే. ఆమె కమర్షియల్ సినిమాలు చేసినా ఫిమేల్ సెంట్రిక్ సినిమా చేసినా ఏది చేసినా సరే ఆడియన్స్ ఆమెను ఆదరిస్తారు. ఐతే ఈమధ్య వరుస సినిమాలు చేయకుండా కెరీర్ గ్యాప్ తీసుకుంటున్న అనుష్క మళ్లీ తిరిగి ఫాం లోకి రావాలని చూస్తుంది. ఈ క్రమంలోనే ఘాటి అనే సినిమా చేస్తుంది. క్రిష్ డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఈ సినిమా టీజర్ తో అంచనాలు పెంచేశారు. అనుష్క లోని మాస్ యాంగిల్ ని మరోసారి ఈ సినిమాతో చూపించబోతున్నారు. అనుష్క చేసిన అరుంధతి, రుద్రమదేవి సినిమాలు మరో హీరోయిన్ కి సాధ్యం కాదనేలా ఆమె ఒక క్రేజ్ తెచ్చుకుంది. మిగతా హీరోయిన్స్ అలాంటి ప్రయత్నాలు చేసినా వర్క్ అవుట్ కాలేదు. ఘాటి సినిమా విషయంలో క్రిష్ పర్ఫెక్ట్ ప్లానింగ్ తో వస్తున్నారు. ఈ సినిమా తీయడం ఒక ఎత్తైతే ప్రమోషన్స్ ని కూడా భారీగా ప్లాన్ చేస్తున్నారు. ఘాటి సినిమాను ఏప్రిల్ 18న రిలీజ్ లాక్ చేశారు. అసలైతే ఆ టైం లో ప్రభాస్ రాజా సాబ్ రిలీజ్ అనుకున్నారు కానీ ఆ సినిమా వాయిదా పడుతుందని తెలిసి ఘాటిని వదులుతున్నారు. యువి క్రియేషన్స్ బ్యానర్ లో తెరకెక్కుతున్న ఘాటి సినిమా ప్రమోషన్స్ కి రెబల్ స్టార్ ప్రభాస్ ని కూడా వాడుకోవాలని చూస్తున్నారట. అనుష్క కోసం ప్రభాస్ ని అడిగితే తప్పకుండా ఓకే అంటాడు. యువి బ్యానర్ అంటే ప్రభాస్ సొంత సంస్థ అన్నట్టే అందుకే అనుష్క ఘాటి ప్రమోషన్స్ కి ప్రభాస్ కూడా తన సపోర్ట్ అదించడానికి రెడీ అన్నట్టు తెలుస్తుంది. ఘాటి సినిమాను కేవలం తెలుగులో కాకుండా పాన్ ఇండియా రిలీజ్ ప్లానింగ్ లో ఉన్నారు. అందుకే నేషనల్ లెవెల్ లో ఈ సినిమాకు రీచ్ ఉండాలి అంటే బాహుబలి ప్రభాస్ తోనే సినిమాను ప్రమోట్ చేయించాలి. ఘాటి సినిమాలో అనుష్క మరోసారి తన విశ్వరూపం చూపించిందని తెలుస్తుంది. ఇన్నాళ్లు తన లుక్స్ పరంగా ఇబ్బంది ఉందనే కారణంతోనే బయటకు కనిపించకుండా ఉన్న స్వీటీ ఇప్పుడు తన ఇదివరకు లుక్ ని తెచ్చుకుందని తెలుస్తుంది. అనుష్క ఘాటి కోసం తానే స్వయంగా ప్రమోషన్స్ లో పాల్గొంటుందని తెలుస్తుంది. అనుష్కతో ప్రభాస్ కూడా తోడైతే ఘాటికి సూపర్ బూస్టింగ్ దొరికినట్టే లెక్క.ం

# పవర్ స్టార్ ఫ్యాన్స్‌కి పండగ లాంటి వార్త..!



ఆయన ఎంత స్టార్ పొలిటీషియన్ అయినా సరే తెర మీద పవర్ స్టార్ స్టైల్ ని చూసి తరించాలని ఫ్యాన్స్ కోరుతున్నారు. పవన్ కళ్యాణ్ పొలిటికల్ గ్రోత్ చూసి సూపర్ హ్యాపీగా ఉన్న ఫ్యాన్స్ సినిమాల పట్ల ఆయన చూపిస్తున్న అనాసక్తి కి కాస్త నిరుత్సాహంలో ఉన్నారు. ఆయన ఎంత స్టార్ పొలిటీషియన్ అయినా సరే తెర మీద పవర్ స్టార్ స్టైల్ ని చూసి తరించాలని ఫ్యాన్స్ కోరుతున్నారు. ఆయన అసలు సినిమాలు తీయడం మానేస్తే ఎలా ఉంటుందో తెలియదు కానీ ఆల్రెడీ సెట్స్ మీద ఉన్న సినిమాలు ఎప్పుడొస్తాయా అన్న ఎగ్జైట్ మెంట్ మాత్రం ఉంది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నాలుగేళ్ల క్రితం మొదలు పెట్టిన హరి హర వీరమల్లు సినిమా ఇంకా పూర్తి కాలేదు. మరో 8 రోజులు పవన్ షూట్ కి వస్తేనే కానీ అది పూర్తి అవ్వదట. మరోపక్క సుజిత్ డైరెక్షన్ లో ఓజీ సినిమా చేస్తున్న పవన్ ఆ మూవీని పూర్తి చేయాల్సి ఉంది. పవర్ స్టార్ ఫ్యాన్స్ ఈ రెండు సినిమాల కోసం ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా ఓజీ సినిమా గ్లింప్స్ తోనే వారెవా అనిపించింది. కలకత్తా బ్యాక్ డ్రాప్ లో సుజిత్ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా సుజిత్ మార్క్ స్టైలిష్ యాక్షన్ ఎంటర్టైనర్ గా రాబోతుంది. ఈ సినిమా అప్డేట్స్ కోసం ఫ్యాన్స్ అంతా ఆసక్తిగా ఉన్నారు. అందుకే సంక్రాంతికి ఓజీ నుంచి ఒక టీజర్ రిలీజ్ చేసేలా ప్లాన్ చేశారు మేకర్స్. ఏంటి ఓజీ టీజర్ వస్తుందా అని ఫ్యాన్స్ సూపర్ జోష్ తెచ్చుకుంటున్నారు. 1:39 నిమిషాల నిడివితో ఓజీ టీజర్ వస్తుందని తెలుస్తుంది. పొంగల్ జోరు మరింత పెంచేలా ఓజీ టీజర్ రాబోతుంది. ఐతే ఈ టీజర్ తో పాటు రిలీజ్ డేట్ ఏమైనా అనౌన్స్ చేస్తారా అన్న అంచనాలు కూడా ఉన్నాయి. డివివి దానయ్య నిర్మిస్తున్న ఓజీ సినిమాలో పవన్ సరసన ప్రియాంక అరుల్ మోహన్ హీరోయిన్ గా నటిస్తుంది. థమన్ ఈ సినిమాకు నెక్స్ట్ లెవెల్ మ్యూజిక్ అందిస్తున్నాడు. ఓజీ సినిమా తో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మొదటిసారి పాన్ ఇండియా అటెంప్ట్ చేస్తున్నాడు. అందుకే ఈ సినిమా ఫ్యాన్స్ కి ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తుంది. మరి ఓజీతో సుజిత్ పవన్ కళ్యాణ్ ని ఎలా చూపిస్తారన్నది చూడాలి. సినిమా టీజర్ తో ఆ ప్రాజెక్ట్ రేంజ్ ఏంటన్నది చూపించాలని చూస్తున్నారు. సో ఫ్యాన్స్ అంతా టీజర్ కోసం సిద్ధంగా ఉండాల్సిందే



# అందాల రాయ్‌లక్ష్మి బికినీ షో

గతంలో లక్ష్మీ రాయ్ అంటూ పిలిపించుకున్న ఈ అమ్మడు లక్ కలిసి వస్తుందనే ఉద్దేశంతో రాయ్ లక్ష్మిగా పేరు మార్చుకుంది. రెండు దశాబ్దాల క్రితం తెలుగు ప్రేక్షకులకు శ్రీకాంత్‌తో కలిసి రాయ్ లక్ష్మి 'కాంచనమాల కేబుల్ టీవీ' సినిమాతో పరిచయం అయ్యింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు అందం అంతకంతకూ పెరుగుతూనే ఉంది తప్ప తగ్గడం లేదు. గతంలో లక్ష్మీ రాయ్ అంటూ పిలిపించుకున్న ఈ అమ్మడు లక్ కలిసి వస్తుందనే ఉద్దేశంతో రాయ్ లక్ష్మిగా పేరు మార్చుకుంది. పేరు మార్చుకోవడం వల్లనో లేదా ఆమె అందం వల్లనో కానీ రెండు దశాబ్దాలుగా ఇండస్ట్రీలో కొనసాగుతూనే ఉంది. ఈ మధ్య కాలంలో బాలీవుడ్‌లో ఈ అమ్మడు బిజీ అయ్యింది. టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ ఇలా అన్ని భాషల్లోనూ అందమైన ముద్దుగుమ్మ అంటూ గుర్తింపు దక్కించుకుంది. ఈమధ్య కాలంలో పవర్ ఫుల్ పాత్రల్లో, లేడీ ఓరియంటెడ్ సినిమాల్లో నటిస్తున్న రాయ్ లక్ష్మిని ప్రేక్షకులు అందాల ఆరబోత పాత్రల్లో చూడాలని కోరుకుంటున్నారు. గత ఏడాది ఒక సినిమాతో వచ్చిన ఈ అమ్మడు ఈ ఏడాది కనీసం రెండు మూడు సినిమాలతో వచ్చే విధంగా ప్లాన్ చేస్తుంది. వచ్చిన ప్రతి ఆఫర్‌ను సద్వినియోగం చేసుకునే ఉద్దేశ్యంతో ముద్దుగుమ్మ రాయ్ లక్ష్మి వరుసగా సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తుందట. మరో వైపు ఈ అమ్మడు సోషల్ మీడియాలో ఎప్పటిలాగే తన అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూనే ఉంది. తాజాగా మరోసారి రాయ్ లక్ష్మి చూపు తిప్పనివ్వని అందంతో ఫోటోలు షేర్ చేసి కన్నులు విందు చేసింది. గతంలో చాలా సార్లు రాయ్ లక్ష్మి బికినీ ఫోటో షూట్‌ను షేర్ చేసింది. ఎప్పటికప్పుడు విభిన్నంగా, మరింత అందంగా కనిపిస్తూ కవ్విస్తూ ఉంది. ఈసారి అంతకు మించి అంటూ ముద్దుగుమ్మ బికినీ ఫోటోలు ఉన్నాయి. లైట్ పింక్ కలర్‌లో ఉన్న బికినీ ధరించిన స్టైలిష్ గాగుల్స్ ధరించిన ముద్దుగుమ్మ రాయ్ లక్ష్మి ఇండస్ట్రీలో అడుగు పెట్టి ఇరవై ఏళ్లు అంటే నమ్మడానికి లేదు. ఆమె వయసు 20 ఏళ్లు అయ్యి ఉంటుందని కామెంట్స్ చేస్తున్నారు. పాతికేళ్ల పడుచు అమ్మాయి అన్నట్లుగా ఉన్న ఈ అమ్మడు ఇరవై ఏళ్లుగా సినిమాలు ఎలా చేస్తుందని కామెంట్స్ చేస్తున్నారు. ఇండస్ట్రీలోకి వచ్చి ఇరవై ఏళ్లు అవుతుంది కనుక వయసు దాదాపుగా నాలుగు పదుల వయసుకు చేరువ అయ్యి ఉంటుంది. అయినా ఇంత అందం ఎలా సాధ్యం అంటూ చాలా మంది అవాక్కవుతున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో ఈమె షేర్ చేసే ఫోటోలు వీడియోలు చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నెట్టింట ఈమె ఫోటోలకు వస్తున్న స్పందనతో మరిన్ని సినిమా ఆఫర్లు వస్తాయేమో చూడాలి



### కేజీఎఫ్ తరువాత మరోసారి

# వైల్డ్ లుక్‌లో యష్

'కేజీఎఫ్, కేజీఎఫ్-2 చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను కూడా ఆకట్టుకున్న కన్నడ కథానాయకుడు యష్. 'కేజీఎఫ్'లో ఆయన మాస్ లుక్‌కు, మాస్ అవతార్‌కు ప్రేక్షకులు ఫిదా అయిపోయారు. కేజీఎఫ్-2 తరువాత మరో సినిమా అంగీకరించడానికి చాలా సమయం తీసుకున్నారు యష్. తాజాగా ఆయన నటిస్తున్న చిత్రం 'టాక్సిక్'.

పాన్ ఇండియా స్థాయిలో రూపుదిద్దుకుంటోన్న ఈ చిత్రాన్ని గీతు మోహన్‌దాస్ దర్శకత్వంలో మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ పతాకాలపై వెంకట్ కె.నారాయణ, యష్ నిర్మిస్తున్నారు. కాగా నేడు జనవరి 8న హీరో యష్ బర్త్‌డే సందర్భంగా ఈ చిత్రం నుంచి ఆయన లుక్‌తో పాటు గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోనప్స్ నుంచి బర్త్‌డే పీక్ అంటూ యష్ బర్త్‌డే ట్రీట్‌ను వదిలారు నిర్మాతలు.

గ్లింప్స్ చూస్తుంటే బోల్డ్ కంటెంట్‌తో హాట్‌గా ఉంది. చిత్రం ప్రేక్షకుల అంచనాలకు మించి ఉండబోతుందని, కొత్తదనం కోసం తపించే యష్ ఈ చిత్రంలో ఎంతో డిఫరెంట్‌గా, మోర్ మాసివ్‌గా కనిపించబోతున్నాడని అంటోంది చిత్ర యూనిట్. భారీ ఖర్చుతో, ప్రముఖ తారాగణంతో రూపుదిద్దుకుంటోన్న ఈ చిత్రంలో ప్రేక్షకులు ఎన్నో షాకింగ్ అంశాలను చూస్తారని, వారికి సరికొత్త అనుభూతిని పంచే చిత్రంగా ఇది ఉండబోతుందని దర్శకురాలు గీతు మోహన్‌దాస్ చెబుతున్నారు



# చీరకట్టులో అందాల రాక్షసి వయ్యారాలు.. వ్వాటే లుక్స్!

పీచ్ కలర్ చీరలో మెల్లగా మెరిసిపోతూ కనిపించిన లావణ్య ఫోటోస్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'అందాల రాక్షసి' సినిమాతో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న లావణ్య, తన అందం, అభినయంతో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆమె కెరీర్ ప్రారంభంలోనే వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించడంలో సక్సెస్ అయ్యారు. ఇక తాజాగా తన ట్రెడిషనల్ లుక్‌తో మళ్లీ సోషల్ మీడియాలో హీటెక్కించిన విధానం వైరల్ అవుతోంది. పీచ్ కలర్ చీరలో మెల్లగా మెరిసిపోతూ కనిపించిన లావణ్య ఫోటోస్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. చీరకట్టులో ఆమె అందం అభిమానులను ఆకర్షిస్తోంది. ఈ లుక్‌లో సింప్లిసిటీకి గ్లామర్ జోడించి తనదైన స్టైల్‌ను చూపించారు. లావణ్య త్రిపాఠి తన డ్రెస్సింగ్ చాయిస్‌తో ఎల్లప్పుడూ ప్రత్యేకమై నిలుస్తారు, ఈ సారి కూడా అదే ప్రూవ్ అయ్యింది. మెకప్ చాలా సాఫ్ట్‌గా ఉండగా, ఆమె సొగసైన జడ ధరించిన చెవిపోగులు, హుందాతనానికి తార్కాణంగా నిలిచాయి. అవకాశాలు తగ్గినా, సోషల్ మీడియాలో మాత్రం ఆమె క్రేజ్ తగ్గడం లేదు. ఇన్‌స్టాగ్రామ్‌లో లావణ్య తరచుగా తన అందాలను మెరిపిస్తూ, ఫ్యాన్స్‌ను కనువిందు చేస్తుంటారు. ఇటీవలనే ఆమె మెగా ఫ్యామిలీ కోడలిగా మారి కొత్త జీవితంలో అడుగు పెట్టారు. ప్రొఫెషనల్ లైఫ్‌ను, పర్సనల్ లైఫ్‌ను సమన్వయం చేస్తూ కెరీర్‌లో మరో హిట్ కోసం సిద్ధమవుతున్నారు. ఆమె గత చిత్రాల విషయానికి వస్తే, 'మిస్టర్,' 'సోగ్గాడే చిన్ని నాయన,' 'భలే భలే మగాడివోయ్' వంటి బ్లాక్ బస్టర్స్ ఆమె కెరీర్‌కు మంచి బూస్ట్ ఇచ్చాయి. ప్రస్తుతం 'సతీ లీలావతి' అనే ప్రాజెక్ట్‌తో బిజీగా ఉన్నారు. ఈ సినిమా ఆమెకు మరింత గుర్తింపు తీసుకొస్తుందని సినీ వర్గాలు ఆశిస్తున్నాయి. టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్‌ను నిలబెట్టుకున్న లావణ్య, పలు భాషల్లో కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ట్రెడిషనల్ లుక్‌తో అలా మెరిసిపోయిన ఈ ఫోటోలు, మరోసారి ఆమె తన అందాన్ని ఎలా ప్రదర్శించాలో చూపిస్తున్నాయి. 'సతీ లీలావతి'తో మరోసారి ప్రేక్షకులను మెప్పించే పనిలో ఉన్న లావణ్య త్రిపాఠి, ఫ్యాన్స్‌ను మరింతగా ఆకట్టుకుంటారనే ఆశాభావం ఉంది. చూడాలి మరి అమ్మడు ఎంతవరకు సక్సెస్ అందుకుంటుందో